కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శనివారం 31, అక్టోబర్ 2026 16 పేజీలు

పోలీస్ స్టేషన్ పనితీరుపై సీపీ ఆకస్మిక తనిఖీ



2లో



ఆలుగునూర్‌లో రాజీవ్ రహదారిపై హోటళ్ల ఇష్టారాజ్యం

రోడ్డునే ఆక్రమించి వ్యాపారాలు..

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం.. ప్రమాదాలకు పాంచి ఉన్న ముప్పు..

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



2లో

ప్రమాదం జరిగాకే మేల్కొంటారా..?

జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలంటున్న స్థానికులు

తిమ్మాపూర్, ప్రభాతవార్త: ప్రజల ప్రాణాలకు భద్రత కరువవుతోందా? ప్రధాన రహదారులపై ఆక్రమణలు జరుగుతున్నా అడ్డుకునే నాథుడే లేడా? ఏదైనా ఘోర ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తేనే అధికార యంత్రాంగం స్పందిస్తుందా? ఆలుగునూర్ రాజీవ్ రహదారిపై నెలకొన్న పరిస్థితులు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ ఆలుగునూర్‌లో హోటళ్ల నిర్వాహకులు రహదారిని ఆనుకుని బండ్లు ఏర్పాటు చేసి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన రహదారిపై వ్యాపార కార్యకలాపాలు విస్తరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై ఈ ఆక్రమణలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



విష సర్పాల నీడలో విద్యాభ్యాసం..!



ప్రహరీ గోడ లేని భరత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల

ఆవరణలోకి యథేచ్ఛగా పాముల రాకపోకలు..

చిన్నారుల ప్రాణాలకు పాంచి ఉన్న ముప్పు

బహిరంగ ప్రదేశంలోనే మధ్యాహ్న భోజనం

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోరా?

పాఠశాల చుట్టూ పొలాలు, పిచ్చి మొక్కలు, దట్టమైన పొదలు ఉండటంతో విషపూరితమైన పాములు తరచూ ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

తంగళ్లపల్లి, ప్రభాతవార్త: చదువుల బాట పట్టాల్సిన చిన్నారులు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. అక్షరాలు నేర్చుకోవాల్సిన తరగతి గదుల్లో విష సర్పాల సంచారం వారిని వణికిస్తోంది. పాఠశాల ఆవరణలోకి పాములు వస్తున్నా అడ్డుకునే రక్షణ గోడ లేదు. కనీస భద్రత కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదీ తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి. సుమారు 50 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు నాలుగు వైపులా ప్రహరీ గోడ లేకపోవడంతో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

క్రీడలతో ప్రపంచస్థాయి గుర్తింపు..

ఆర్చరీలో తెలంగాణకు రెండు స్వర్ణ పతకాలు..

క్రీడాకారిణి చికిత్సకు రూ.4.32 కోట్ల ప్రోత్సాహం..

సుల్తానాబాద్ క్రీడలకు పుట్టినిల్లు..

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు

16లో



సుల్తానాబాద్, ప్రభాతవార్త: క్రీడల ద్వారా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందడంతోపాటు రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తీసుకురావచ్చని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సుల్తానాబాద్ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లుగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిని గుర్తించి తగిన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని తెలిపారు.

ప్రమాదం జరిగాకే మేల్కొంటారా..?

ఆలుగునూర్‌లో రాజీవ్ రహదారిపై హోటళ్ల ఇష్టారాజ్యం

రోడ్డునే ఆక్రమించి వ్యాపారాలు..

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

ప్రమాదాలకు పొంచి ఉన్న ముప్పు..

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలంటున్న స్థానికులు

తిమ్మాపూర్, ప్రభాతవార్త: ప్రజల ప్రాణాలకు భద్రత కరువవుతోందా? ప్రధాన రహదారులపై ఆక్రమణలు జరుగుతున్నా అడ్డుకునే నాథుడే లేడా? ఏదైనా ఘోర ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తేనే అధికార యంత్రాంగం స్పందిస్తుందా? ఆలుగునూర్ రాజీవ్ రహదారిపై నెలకొన్న పరిస్థితులు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ ఆలుగునూర్‌లో హోటళ్ల నిర్వాహకులు రహదారిని ఆనుకుని బండ్లు ఏర్పాటు చేసి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన రహదారిపై వ్యాపార కార్యకలాపాలు విస్తరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై ఈ ఆక్రమణలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపైనే హోటళ్ల వ్యాపారం..

రాజీవ్ రహదారి కరీంనగర్ పరిసర ప్రాంతాలకు కీలకమైన రాకపోకల మార్గం. ఈ రహదారిపై నిత్యం ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి ప్రధాన మార్గంలో హోటళ్ల నిర్వాహకులు రహదారి స్థలాన్ని ఆక్రమించి బండ్లు ఏర్పాటు చేయడం సమస్యగా మారింది. వ్యాపారాల నిర్వహణ కోసం రోడ్డుపైకి విస్తరించడంతో వాహనాలు వెళ్లేందుకు అందుబాటులో ఉండే స్థలం తగ్గిపోతోంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వడం, బస్సులు వెళ్లేందుకు అవకాశం కల్పించడం కష్టంగా మారుతోంది. ఫలితంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం!

ప్రధాన రహదారిపై వ్యాపారాల కోసం స్థలాన్ని ఆక్రమించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రహదారిపై ముందుకు వెళ్లే క్రమంలో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కనే బండ్లు, మరోవైపు వేగంగా వచ్చే వాహనాలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు సైతం ట్రాఫిక్ ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు. రహదారిపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఆక్రమణలు కొనసాగుతున్నా వాటిని తొలగించేందుకు చర్యలు లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అధికారులు ఈ సమస్యను ఎందుకు



విస్మరిస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విన్నవించినా వినిపించుకోవడం లేదా?

ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించడం లేదని వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరినా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం పరిస్థితి తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలు తొలగించకపోతే భవిష్యత్తులో పెద్ద ప్రమాదం జరిగే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

ప్రమాదం జరిగాక స్పందిస్తే ప్రయోజనమేమిటి?

సాధారణంగా ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు హడావుడిగా తనిఖీలు నిర్వహించడం, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేయడం పరిపాటిగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. కానీ ప్రమాదం జరగకముందే సమస్యను గుర్తించి పరిష్కరిస్తే విలువైన ప్రాణాలను కాపాడవచ్చని సూచిస్తున్నారు. ఆలుగునూర్ రాజీవ్ రహదారిపై ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఏదో ఒక రోజు తీవ్ర ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పటివరకు అధికారులు వేచి చూడకుండా ఇప్పుడే స్పందించాలని కోరుతున్నారు.కలెక్టర్ జోక్యం చేసుకోవాలి..

జిల్లా కలెక్టర్ తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించాలని

ఆలుగునూర్ వాసులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారిపై ఉన్న ఆక్రమణలను గుర్తించాలని, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న బండ్లను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. హోటళ్ల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ యథాతథంగా పరిస్థితి మారకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి ప్రయాణికులకు సురక్షిత రాకపోకలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా? ఫిర్యాదులు చేసినా స్పందన ఎందుకు లేదు? అన్న ప్రశ్నలు ఇప్పుడు ఆలుగునూర్‌లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి చర్యలు చేపట్టాలని, ప్రమాదం జరిగి కన్నీళ్లు మిగిలిన తర్వాత కాకుండా ముందుగానే మేల్కొని రహదారిని ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ పనితీరుపై సీపీ ఆకస్మిక తనిఖీ

రికార్డులు, లాకప్, పరిసరాల పరిశీలన

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

బాధితులకు సత్వర న్యాయం అందించాలి..

సిబ్బందికి గౌష్ ఆలం ఆదేశాలు

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

పోలీస్ స్టేషన్ల పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయన వివిధ విభాగాలను పరిశీలించి రికార్డుల నిర్వహణ, కేసుల వివరాలు, లాకప్ గది, స్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు అందుతున్న సేవలు, సిబ్బంది వ్యవహారశైలిపై ఆరా తీశారు.

ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలి

పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, సమస్య తీవ్రతను బట్టి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధితులను అనవసరంగా స్టేషన్ల చుట్టూ తిప్పించకుండా చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించరాదని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, ప్రజా భద్రతకు సంబంధించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు క్రమబద్ధంగా నిర్వహించాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో ఏసీపీ వెంకటస్వామి, టూ టౌన్ సీఐ సృజన్‌రెడ్డి, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





విష సర్పాల నీడలో విద్యాభ్యాసం!

ప్రహరీ గోడ లేని భరత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల

పాఠశాల ఆవరణలోకి యథేచ్ఛగా పాముల రాకపోకలు

50 మంది చిన్నారుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు

చెట్ల కిందే చదువులు.. బహిరంగ ప్రదేశంలోనే మధ్యాహ్న భోజనం

అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోరా?

తంగళ్లపల్లి, ప్రభాతవార్త: చదువుల బాట పట్టాల్సిన చిన్నారులు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. అక్షరాలు నేర్చుకోవాల్సిన తరగతి గదుల్లో విష సర్పాల సంచారం వారిని వణికిస్తోంది. పాఠశాల ఆవరణలోకి పాములు వస్తున్నా అడ్డుకునే రక్షణ గోడ లేదు. కనీస భద్రత కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదీ తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి. సుమారు 50 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు నాలుగు వైపులా ప్రహరీ గోడ లేకపోవడంతో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల చుట్టూ పొలాలు, పిచ్చి మొక్కలు, దట్టమైన పొదలు ఉండటంతో విషపూరితమైన పాములు తరచూ ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలలో నాగుపాముల సంచారం..

పాఠశాల ఆవరణలో వంటగది, తరగతి గదుల సమీపంలో సైతం విషపూరితమైన పాములు కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల నాగుపాములు పాఠశాల ఆవరణలోకి రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనన్న భయంతో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పొలాల నుంచి పాములు నేరుగా ఆవరణలోకి వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఒకవైపు పాముల భయం, మరోవైపు పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలు చిన్నారులకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. పాఠశాలలో ప్రశాంతంగా చదువుకోవాల్సిన విద్యార్థులు పరిసరాలను గమనిస్తూ కాలం గడపాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల కిందే చదువులు.. బహిరంగంగానే భోజనాలు!

పాఠశాల ఆవరణకు రక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లోనే విద్యాభ్యాసం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలోనూ చిన్నారులకు భద్రతపై ఆందోళన తప్పడం లేదు. వంటగది పరిసరాల్లోకి సైతం పాములు వస్తుండటంతో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన పాఠశాల ఆవరణే ప్రమాదకరంగా మారడం విద్యా వ్యవస్థలోని నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. పాఠశాల చుట్టూ కనీసం ప్రహరీ గోడ నిర్మిస్తే బయట నుంచి పాములు, ఇతర జంతువులు లోపలికి వచ్చే ప్రమాదాన్ని కొంతవరకు నివారించవచ్చని చెబుతున్నారు.

బిడ్డలను బడికి పంపాలంటేనే భయం!

ఉదయం పాఠశాలకు పంపిన పిల్లలు సాయంత్రం క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారో లేదోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనూ పాఠశాలలో పాములు కనిపించాయని, పలుమార్లు సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేసినా పరిష్కారం లభించలేదని వారు వాపోతున్నారు. చిన్నారుల భద్రత విషయంలో ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. పాఠశాల ఆవరణలోకి బయట వ్యక్తులు, పశువులు, ఇతర జంతువులు సులభంగా ప్రవేశించే అవకాశం ఉండటంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ భరత్‌నగర్ పాఠశాలలో కనీస ప్రహరీ గోడ కూడా లేకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు.

అధికారులు ఇప్పటికైనా స్పందించాలి..

50 మంది విద్యార్థుల భద్రతకు సంబంధించిన సమస్యను అధికారులు తేలిగ్గా తీసుకోవద్దని గ్రామస్థులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణమే స్పందించి పాఠశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, పొదలను తొలగించడంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు పాముల సంచారాన్ని అరికట్టేందుకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సింగరేణి నిధులు సరే.. దక్కేదెప్పుడు?

రూ.760 కోట్ల డీఎంఎఫ్‌టీ బకాయిలపై అనుమానాలు

గోదావరిఖని,ప్రభాత వార్త: సింగరేణి బొగ్గు గనుల ద్వారా సమకూరుతున్న జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్‌టీ) పెద్దపల్లి జిల్లాకు ఎంత మేరకు చేరుతోంది? జిల్లాకు రావాల్సిన నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయి? ఇక్కడ అభివృద్ధి పనులు పూర్తయినా బిల్లులు ఎందుకు చెల్లించడం లేదు? ఈ ప్రశ్నలను ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ లేవనెత్తారు. రామగుండం1, 2, 3 బొగ్గు గనుల ద్వారా డీఎంఎఫ్‌టీకి సుమారు రూ.760 కోట్ల మేర నిధులు బకాయి ఉన్నాయని పేర్కొంటూ శుక్రవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.2022 నుంచి ఇప్పటివరకు జిల్లాకు రావాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులు పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోందని దినేష్ తెలిపారు. మరోవైపు జిల్లాలో చేపట్టిన 453 పనులకు సంబంధించి రూ.135.80 కోట్ల విలువైన ఎంబీ రికార్డులు పూర్తయినా బిల్లులు చెల్లించలేదని వివరించారు. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారని, నిధుల కొరతతో తదుపరి పనులు కూడా ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు.డీఎంఎఫ్‌టీ నిధులను గనుల ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాల్సి ఉండగా, పెద్దపల్లి జిల్లాకు సంబంధించిన నిధులు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు, పక్క జిల్లాల్లోని పనులకు మళ్లుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని దినేష్ అన్నారు. యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణంతో పాటు ఇతర కార్యక్రమాలకు వందల కోట్ల రూపాయలు తరలించినట్లు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. జిల్లా డీఎంఎఫ్‌టీ కమిటీకి తెలియకుండానే నిధుల వినియోగంపై నిర్ణయాలు జరుగుతున్నాయా అని ప్రశ్నించారు.ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జోక్యంతోనే పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన నిధులు ఇతర అవసరాలకు మళ్లుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయని ఆరోపించారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు డీఎంఎఫ్‌టీ కమిటీలో సభ్యులుగా ఉన్నప్పటికీ ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ.135.80 కోట్లలో 2023 తర్వాత చేపట్టిన 269 పనులకు రూ.107.14 కోట్లు, అంతకుముందు చేపట్టిన 184 పనులకు రూ.28.65 కోట్లు చెల్లించాల్సి ఉందని దినేష్ వివరించారు. నియోజకవర్గాల వారీగా పెద్దపల్లిలో రూ.70 కోట్లకు పైగా, మంథనిలో సుమారు రూ.51 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2023కి ముందు చేపట్టిన పనుల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో 28 పనులకు రూ.21.12 కోట్లు, రామగుండంలో 94 పనులకు రూ.3.43 కోట్లు, మంథనిలో 27 పనులకు రూ.60 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు.సింగరేణి నుంచి డీఎంఎఫ్‌టీకి నిధులు జమ కాకపోవడంతోనే బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే జిల్లాలో బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఇతర ప్రాంతాల్లో నిధుల వినియోగం ఎలా జరుగుతోందన్నది స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై టన్నుకు సుమారు రూ.32 నుంచి రూ.180 వరకు డీఎంఎఫ్‌టీకి నిధులు సమకూరాల్సి ఉంటుందని దినేష్ తెలిపారు. బొగ్గు గనుల ప్రభావంతో పర్యావరణ, మౌలిక సదుపాయాల సమస్యలు ఎదుర్కొంటున్న పెద్దపల్లి జిల్లాకు ఈ నిధులు అత్యంత అవసరమన్నారు. జిల్లాకు రావాల్సిన నిధుల మొత్తం, సింగరేణి నుంచి జమ అయిన వివరాలు, ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేసిన మొత్తాలను బహిర్గతం చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు పెద్దపల్లి జిల్లాకు కేటాయించాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులు ఇక్కడి అభివృద్ధికే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రతే లక్ష్యం

ఉల్లంఘనలపై పోలీసుల ప్రత్యేక నిఘా

ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

కమాన్ చౌరస్తా వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్..

100కు పైగా వాహనాల తనిఖీ



పెద్దపల్లి, ప్రభాతవార్త: వాహనదారులు ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాలను పరిశీలించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, మైనర్ల డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం, రహదారులపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ తనిఖీల్లో 100కు పైగా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి జరిమానాలు విధించినట్లు చెప్పారు. రహదారులపై అప్రమత్తంగా ఉండకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు ప్రయాణ సమయంలో ఆర్సీ, బీమా పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, సురక్షిత ప్రయాణం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని తెలిపారు. ఉల్లంఘనలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ బి. శ్రీనివాస్, గోదావరిఖని ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన పుల్లూరి వేణుగోపాలరావు

శ్రీకాంత్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం

మానవత్వం చాటుకున్న వేణుగోపాలరావు..

ఎస్సీ కుల పెద్దల కృతజ్ఞతలు



జూలపల్లి,ప్రభాతవార్త: జూలపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన నెరువట్ల రామస్వామి కుమారుడు నెరువట్ల శ్రీకాంత్ అనారోగ్యంతో మృతి చెందాడు.కుటుంబంలో విషాదం నెలకొనగా,అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో విషయం తెలుసుకున్న ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావు స్పందించారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి శ్రీకాంత్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000/ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఆపద సమయంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించడం పట్ల ఎస్సీ కాలనీ కుల పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన పుల్లూరి వేణుగోపాలరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జూలపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్,కుల పెద్దమనిషి నెరువట్ల శంకరయ్య,నెరువట్ల మహేందర్,ఎదుల్ల మల్లేశం,బెజ్జంకి సంతోష్, నెరువట్ల కొమురయ్య,నెరువట్ల శేఖర్,రమేష్,నెరువట్ల రాజు,ఎలుకపెల్లి రమేష్,మానుమండ్ల వేణు,నెరువట్ల సురేష్,మానుమండ్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన పుల్లూరి వేణుగోపాలరావుకు ఎస్సీ కుల పెద్దలందరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పిల్లలు ధైర్యంగా చెడును గుర్తించి, ఫిర్యాదు చేయాలి: సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఖిసురక్షిత్ బచ్పన్ అభియాన్‌ఖిలో భాగంగా కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ చింతకుంటలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి, చెడులను గుర్తిస్తూ, అసౌకర్యమైన లేదా అనుమానాస్పద ప్రవర్తన ఎదురైతే ధైర్యంగా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలపాలని ఫిర్యాదు చేయాలని సూచించారు. న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కొండ్ర మోనిక, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేరాలు-దారుణాలు



పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు..

ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు.. టాస్క్ ఫోర్స్ ఏసీపి సతీష్..

మానకొండూర్ ప్రభాత వార్త : శంకరపట్నం మండల కేంద్రంలో ఓ పార్టీ ప్రముఖ రాజకీయ నాయకుడుని ఇంట్లో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు శుక్రవారం చేపట్టారు. టాస్క్ ఫోర్స్ ఏసీపి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండల కేంద్రంలో ఓ రాజకీయ నాయకుడు ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు చేపట్టగా ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. దాడుల్లో రెండు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్ ఫోన్లు, నగదు రూ.11,350, ఫోన్ పే రూ.15,350 రూపాయలను స్వాధీనం చేసుకుని పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, శంకరపట్నం పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సురేంద్ర పాల్ సింగ్, మల్లేష్, కానిస్టేబుల్ సాయి దీప్, పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏసిపి తండ్రి మృతి....

సంతాపం తెలిపిన సర్పంచ్.



వీణవంక, ప్రభాత వార్త: వీణవంక మండలము కోర్కల్ గ్రామస్థుడైన హైదరాబాద్ లో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ డిటెక్టివ్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా పనిచేస్తున్న సార్ల రాజు తండ్రి పోచయ్య అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.మృతిపట్ల గ్రామ సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ అనిల్ తో పాటు గ్రామస్థులు సంతాపం ప్రకటించారు.

సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ శ్రేణులు

అంతర్గాం, ప్రభాత వార్త : కాళేశ్వరం ప్రాజెక్ట్ లో నీళ్ల స్టోరజీ చేయకుండా తెలంగాణ రైతాంగానికి సాగునీరు, ప్రజలకు త్రాగునీరు అందించని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విధానాలను నిరసిస్తూ తెలంగాణ ఉద్యమకారులు బొడ్డు రవీందర్, ఉప్పు రాజ్ కుమార్ లు మేడిగడ్డ నుండి కొండ పోచమ్మ సాగర్ వరకు తలపెట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం రామగుండం పట్టణానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో బి. ఆర్. ఎస్. రాష్ట్ర నాయకుడు కార్మిక నేత కౌశిక హరి ఆధ్వర్యంలో బి. ఆర్. ఎస్. శ్రేణులు సైకిల్ యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉద్యమ కారులు బొడ్డు రవీందర్, ఉప్పు రాజ్ కుమార్ లను శాలువా లతో సన్మానించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమం లో బి. ఆర్. ఎస్. రామగుండం పట్టణ అధ్యక్షుడు బొడ్డపల్లి శ్రీనివాస్, కార్పొరేటర్ నిమ్మరాజుల రజని రవి, మాజీ కార్పొరేటర్ కోదాటి ప్రవీణ్, నాయకులు మద్దికుంట శంకర్, కుక్క గంగా ప్రసాద్, మాడిశెట్టి రవీందర్, మడ్డి అన్వేష్ రెడ్డి,ఆలేటి గణేష్, అల్లి గణేష్, ఉప్పరి లక్ష్మణ్, సజ్జు తదితరులు పాల్గొన్నారు...



కోరుట్లలో మేధావుల సదస్సు

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీ నారాయణ, పట్టణ కమిటీ వారి ఆధ్వర్యంలో మేధావుల సదస్సు శుక్ర వారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై అనూప్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, జిల్లా డాక్టర్స్ కన్వీనర్ గంగా సాగర్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశం ప్రపంచ దేశాలకు విశ్వ గురువుగా మారిందని, దానికి కారణం మన ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రతి దేశం నరేంద్ర మోడీ తమ దేశ అత్యున్నత



పురస్కారంతో సన్మానిస్తుందని, భారత దేశ ప్రధానిని కొన్ని సంఘ విద్రోహ శక్తులు కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేంద్ర మోడీ, గద్దె దించాలని శత్రు దేశాల సహకారంతో దేశంలో అల్లర్లు సృష్టించాలని కొంత మంది దేశానికి ధర్మాసనంకి విఘాతం కలిగించేలా కాక్రోచ్ జనతా పార్టీ అనే ఆన్లైన్ పార్టీని స్థాపించి దాని ద్వారా అమాయకైన విద్యార్థులను అడ్డం పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పై నరేంద్ర మోడీ అసత్యాలను ప్రచారం చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దేశ ప్రజలు అందరూ కూడా నరేంద్ర మోడీ అండగా ఉన్నారని నరేంద్ర మోడీ కానీ బీజేపీ ప్రభుత్వంనీ కానీ ఏమి చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ మేధావులు జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, కోరుట్ల, మెట్పల్లి పట్టణ అధ్యక్షులు, కోరుట్ల మండల మల్లాపూర్ మండల అధ్యక్షులు, కోరుట్ల నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత యూనిఫామ్ల పంపిణీ

మేడిపల్లి, ప్రభాతవార్త :



తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తున్న ఉచిత యూనిఫామ్ ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా యూనిఫామ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ ఆఫీసర్ రమేష్ బాబు, కళాశాల ప్రిన్సిపల్ కొంక వేణు హాజరై విద్యార్థులకు యూనిఫామ్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పిస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం సభ్యులు అనీష్, విశ్వ ప్రసాద్, రాజు, గుర్రాల సాయి కృష్ణ, రాంబాబు, జ్ఞానేశ్వర్, అరుణ్, రాజశేఖర్, లక్ష్మణ్, నాగేశ్వరి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల సందర్శన

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త



కోరుట్ల మండలంలోని జోగన్ పల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో వోదెల రామకృష్ణ సందర్శించి ఎల్లినో ప్రభావం పై త్రాగునీటి సరఫరా ఇంకుడు గుంతల పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతల పై సర్పంచ్, కార్యదర్శి కి సూచనలు చేశారు. త్రాగునీరు మిషన్ భగీరథ ఎలా వస్తున్నాయని, ప్రతి ఇంటి నల్లాకు ఆఫ్ ఆన్ బిగించాలని సూచించారు. నీరుని ఎట్టి పరిస్థితిలో వృధా చేయరాదని, నీటిని ఒడిసి పట్టాలని నీరు ఎక్కడ నిల్వ ఉంటే అక్కడే ఇంకుడు గుంతలు కట్టుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. ఇన్ఫిల్ట్యూషన్ లో ఇంకుడు గుంతలు నిర్మించాలని డ్రైనేజ్, ఎండు ఇంకుడు గుంత నిర్మించాలని సూచించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, కార్యదర్శి గీతా రాణి,వార్డు సభ్యులు సుజాత శిరీష,నితీష, గంగాధర్, రాజేష్ శేఖర్, అశోక్, వి బి జి రామ్ జి మెట్ వినోద్, కారోబార్ అంజయ్య పాల్గొన్నారు

డిమాండ్ల సాధనకై భోజన విరామంలో ఉపాధ్యాయుల నిరసన

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



తెలంగాణ మోడల్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు జగిత్యాల మండలం రూరల్ కండ్లపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు,ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఈ నెల 8వ తేదీన ప్రభుత్వానికి నోటీసు ఇచ్చామని, అయితే గడువు పూర్తయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని,సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్,డిఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే టిజిటిలకు నోషనల్ సర్వీస్ వర్తింపజేయాలని,జీవో 317 అమలు చేసి ప్రమోషన్లు కల్పించాలని,పీజీటీలకు జేఎల్ కేడర్ వర్తింపజేయడంతో పాటు ఖాళీగా ఉన్న హిందీ పీజీటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇహెచ్ఎస్ హెల్త్ స్కీమ్ను నిబంధనల ప్రకారం అమలు చేయాలని,ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయడంతో పాటు అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి హెచ్బిటిలకు కనీస వేతనం చెల్లించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని,లేనిపక్షంలో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ధనలక్ష్మీ ఆలయంలో ఘనంగా ప్రత్యేక కుంకుమ పూజలు..

జగిత్యాల అర్బన్ ప్రభాత వార్త జగిత్యాల పట్టణ పరిధిలోని చింతకుంట చెరువు సమీపంలో వెలసిన శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో ఆశ్వీయుజ మాస పంచమి శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. పారాయణం అనంతరం భక్తులు అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా ఒడిబియ్యం సమర్పించారు. కుంకుమార్చన పూర్తయిన తర్వాత నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా ఎంపికైన ఒక మహిళా భక్తురాలికి ఆలయ ప్రధాన అర్చకుల వేదాశీర్వచనాలతో అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, తాంబూలాన్ని అందజేశారు. అనంతరం భక్తులందరూ అమ్మవారికి భక్తిభావంతో ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, అర్చకులు శ్రీహరి, మహిళా ప్రతినిధులు వడ్లగట్ట స్వాతి, అన్నపూర్ణ, వనజ, జ్యోతి, లక్ష్మి, మంగ, మనీష, సుప్రజ, గంగమ్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.



సాగు భూమి సంరక్షణపై అవగాహన

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



మండలంలోని గ్రామంలో సాగు భూమి సంరక్షణ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగమణి మాట్లాడుతూ భూమిని ఏవిదంగా సంరక్షించుకోవాలో వివరించారు. యాసంగిలో వరి పంటకు అవసరమైన నీరు సరిపోదని, వరి పంట వేయకుండా అపరాలకు మొగ్గు చూపాలని రైతులకు వివరించారు. సబ్సిడీ లో మినుములు అందుబాటులో వున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, రైతులు పాల్గొన్నారు

కోరుట్ల వాసిని ప్రశంసించిన పీఎం నరేంద్ర మోడీ

కోరుట్ల, ప్రభాతవార్త :



భారత ఉక్కు మనిషి, భారత తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి 151వ జయంతి సందర్భంగా నిర్వహించిన భారత్ పర్వ్ - 2026 వేడుకల్లో భాగంగా వివిధ రాష్ట్రాల పర్యాటక శాఖల ఆధ్వర్యంలో స్టేట్ పెవిలియన్లను ఏర్పాటు చేశారు. ఈ స్టేట్ పెవిలియన్ల ప్రారంభోత్సవానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచ్చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ టూరిజం తరఫున మన తెలంగాణకు గర్వకారణమైన సాంప్రదాయ కళ పేరిణి శివతాండవ నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ అద్భుతమైన ప్రదర్శనను అందించిన కోరుట్ల పట్టణానికి చెందిన పిన్నంశెట్టి వెంకటేశ్వర కళాక్షేత్రం పిన్నంశెట్టి సూర్య ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ కళ అయిన పేరిణి నాట్యానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన సూర్యకు పలువురు అభినందనలు తెలిపారు.

పదవి లేకున్నా..

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

41వ డివిజన్‌లో నిలిచిన సీసీ రోడ్ల పనులు పునఃప్రారంభం

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సహకారంతో ముందుకు

గోదావరిఖని,ప్రభాత వార్త: ప్రజాప్రతినిధిగా అధికార పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని 41వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెంటం ఉదయరాజ్ తెలిపారు. డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సహకారంతో పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పాత 32వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో ప్రచారం నిర్వహించినప్పుడు యూజీడీ, సీసీ రోడ్లు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించామని ఉదయరాజ్ తెలిపారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మున్సిపల్ అధికారులకు పనులు చేపట్టాలని సూచించారని వివరించారు.ఈ క్రమంలో మొదటి విడతలో మార్కెట్ శీనన్న గల్లి, నవోదయ కాలనీలోని సలీం అన్న గల్లి, ఆటో రవన్న గల్లి, ధర్మశాస్త్ర కుమార్ అన్న గల్లీల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. రెండో విడతలో సీనియర్ సిటిజన్ హాల్ పరిసర



ప్రాంతాల్లో మరో నాలుగు గల్లీల్లో పనులు చేపట్టాల్సి ఉండగా, ఎన్నికల కోడ్, వర్షాకాలం కారణంగా జాప్యం జరిగిందని చెప్పారు.నిర్మాణ పనులకు అవసరమైన సామగ్రిని 2025లోనే సమకూర్చినప్పటికీ పనులు పూర్తికాలేదని, ఈ విషయాన్ని తిరిగి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అధికారులకు సూచనలు చేశారని తెలిపారు. దీంతో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎలాంటి అధికార పదవిలో లేకపోయినా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఉదయరాజ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నమిండ్ల ఎల్లేష్, సనిత్ కుమార్, సందీప్, చరణ్, కిట్టు, ప్రతాప్, బస్తీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి

అధికారులకు అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు దిశానిర్దేశం

సీఎంఆర్ బియ్యం సరఫరా, కొనుగోలు కేంద్రాల సన్నద్ధతపై సమీక్ష



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. శ్రీరాములు రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో, మిల్లర్లతో సమావేశమై పెండింగ్ బియ్యం సరఫరా, ఖరీఫ్ 202627 ధాన్యం కొనుగోళ్లకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఖరీఫ్ 2025 26లో 1,08,400 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఇంకా సరఫరా కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 63 శాతం మాత్రమే పూర్తయిందని తెలిపారు. రబీ 202526లో 1,19,408 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉండగా, 56 శాతం సరఫరా మాత్రమే జరిగిందని వివరించారు. మిగిలిన బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా అందించి లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 2,15,000 ఎకరాల్లో వరి సాగు కాగా, 4,96,650 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందన్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా 55 శాతం అంటే 2,75,316 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 312 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నవంబర్ రెండో వారం నుంచి జిల్లాలోని 14 మండలాల్లో ధాన్యం కొనుగోళ్లకు రాక మొదలుకానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. కేఎన్ఎం 1638 రకం ధాన్యం సుమారు 1.85 లక్షల మెట్రిక్ టన్నుల మేర వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగిన విధంగా ప్రణాళిక ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేళ్లు, గన్నీ సంచులు సరిపడా అందుబాటులో

ఉంచాలని ఆదేశించారు. 9,360 టార్పాలిన్లు అవసరం కాగా 5,420 ఉన్నాయని, మిగిలిన 3,940 కోసం ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు. 624 మాయిశ్చర్ మీటర్లలో 444 అందుబాటులో ఉండగా, మరో 180 కోసం ఇండెంట్ ఇచ్చినట్లు చెప్పారు. 995 ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేళ్లకు గాను 854 ఉన్నాయని, మిగిలినవి సమకూర్చుకోవాలని సూచించారు. 85.33 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా 52.06 లక్షలు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 33.27 లక్షల కోసం ఇండెంట్ సమర్పించినట్లు పేర్కొన్నారు. పాడీ క్లీనర్లు, డ్రైయర్లు, గ్రెయిన్ కాలిపర్లు, హస్కీ రిమూవర్లను సక్రమంగా వినియోగిస్తూ ధాన్యం నాణ్యత, తేమ పరీక్షలు, తూకం విషయంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలన్నారు. ఎస్‌డబ్ల్యూసీ, ఏఎంసీ, సీడబ్ల్యూసీ, ప్రైవేట్ గోదాముల మొత్తం 5,17,700 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థం ఇప్పటికే నిండిపోయిందని, మరో 1,62,500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వకు అనువైన స్థలాలను గుర్తించినట్లు వివరించారు. అదనపు గోదాముల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, ఈ నెలాఖరులోగా సీఏపీ నిల్వల కోసం స్థలాలను కూడా గుర్తించాలని ఆదేశించారు. కొనుగోళ్లకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, రవాణా, గోదాం సదుపాయాలను సిద్ధం చేసుకొని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీఎంఆర్ బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోలు లక్ష్యాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కలెక్టర్ కు లేక రాసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: కరీంనగర్,పెద్దపల్లి వంటి పొరుగు జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమైనప్పటికీ,జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు ఒక్క కేంద్రం కూడా తెరవకపోవడం పట్ల శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ రాశారు. జగిత్యాల జిల్లాలో తక్షణమే ఐకేపీ పిఏసిసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభించాలని కోరుతూ ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకవైపు సాగునీటి కొరత,మరోకవైపు విద్యుత్ అంతరాయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇవి చాలవన్నట్లు వరి కోత దశకు చేరుకున్న సమయంలో మునుపెన్నడూ లేని విధంగా ఖికత్తెర పురుగుఖి ఆశించి,వరి గొలుకలను కొరికి వేస్తుండటంతో రైతాంగం తీవ్ర పసందులకు గురవుతోందన్నారు.పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ముందస్తుగానే కోతలు చేపడుతున్నారని తెలిపారు.అయితే,జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోవడంతో వేరే దారి లేక రైతులు ప్రైవేట్ రైస్ మిల్లర్లు, వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు 2461 రూపాయలుగా ఉన్నప్పటికీ, వ్యాపారులు 2100 రూపాయలకే కొనుగోలు ప్రారం భించి, ప్రస్తుతం 2000 రూపాయల కంటే తక్కువ ధరకు కొంటూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపిం చారు. ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించిన రకాలకు కూడా వ్యాపార స్తులు సరైన ధర ఇవ్వకపో వడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వపరంగా 2461 రూపాయల మద్దతు ధరకు తోడు 500 రూపాయల బోనస్ కలిపి మొత్తం 2961 రూపాయలు లభించాల్సి ఉండగా,కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారుల చేతిలో మోసపోవాల్సి వస్తోందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న రైతాంగాన్ని దళారులు, వ్యాపారుల దోపిడీ నుంచి కాపాడి మద్దతు ధర అందించేందుకు జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరారు.జగిత్యాల జిల్లా వ్యాప్తంగా తక్షణమే ఐకేపీ,పిఏసిసిఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.



రక్తదానం.. ప్రాణదానంతో సమానం!

ఆపదలో ఉన్న ముగ్గురి ప్రాణాలను కాపాడొచ్చు..

పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి

సుల్తానాబాద్, ప్రభాతవార్త: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి అన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యువత భాగస్వాములు కావాలిఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమవుతుందని తెలిపారు. సకాలంలో రక్తం అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్తదానం ద్వారా కాపాడవచ్చన్నారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులు వైద్యుల సూచనల మేరకు రక్తదానం చేయవచ్చని తెలిపారు. దానం చేసిన రక్తంలోని భాగాలను వేర్వేరుగా వినియోగించడం ద్వారా ముగ్గురు రోగులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుందని వివరించారు.వెయ్యి మంది రక్తదాతల గుర్తింపు లక్ష్యం సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో సుమారు వెయ్యి మంది రక్తదాతలను గుర్తించి, వారిని రక్తదానానికి ప్రోత్సహించాలని డీసీపీ సూచించారు. ఈ దిశగా సర్కిల్ పరిధిలోని ఎస్సైలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా రక్తదాతల వివరాలను సేకరించి, సమన్వయంతో సేవలందించాలని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాల నిర్వహణలో యువత చురుగ్గా పాల్గొని మానవతా దృక్పథాన్ని చాటాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్‌రావు, ఎస్సైలు చంద్రకుమార్, మధుకర్, సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సభ్యులు, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కేరళ మోడల్ హైస్కూల్ విద్యార్థుల సత్తా

జాతీయ పోటీలకు ముగ్గురు విద్యార్థుల అర్హత

పెద్దపల్లి, ప్రభాతవార్త: సుల్తానాబాద్ కేరళ మోడల్ హైస్కూల్‌కు చెందిన ఎ. వైశాలి, వి. అశ్వద్, జి. చరిత జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారని పాఠశాల ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్. నాయర్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని జేఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఇటీవల పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో ఈ ముగ్గురు క్రీడాకారులు సత్తా చాటారు. అండర్17 విభాగంలో ఎ. వైశాలి 60 మీటర్లు, 600 మీటర్లు, జావెలిన్ త్రోలో, వి. అశ్వద్ 60 మీటర్లు, 600 మీటర్ల పరుగులో అర్హత సాధించగా, అండర్14 విభాగంలో జి. చరిత 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్‌తో కూడిన ట్రయాథ్లన్‌లో విభాగంలో ప్రతిభ కనబరిచారు. నవంబర్ 14 నుంచి 16 వరకు హైదరాబాద్ పోచ్చెన్ యూనివర్సిటీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కలిగిన ఐడీ కార్డులను విద్యార్థులకు అందించారు. వాటితో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నప్పుడు గుర్తింపును ధ్రువీకరించుకోవచ్చు. విద్యార్థుల విజయంపై వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్. నాయర్, పీఈటీలు ఎ. అజయ్, డి. రాజు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. జాతీయ పోటీల్లోనూ ఉత్తమ ప్రదర్శనతో పాఠశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



అయ్యప్ప స్వామి ఆలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:

మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి టీ.పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు శుక్రవారం భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఆలయంలో ఇప్పటికే ఉన్న పాత షెడ్డును ఆనుకొని నూతన షెడ్డు నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సుజిత్ రావును ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు మంత్రి అంజయ్య, గంగుల వివేక్, దొమ్మటి ప్రవీణ్ కుమార్, మారుతి, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ ఫిషర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైండ్ల శ్రీకాంత్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఖుతుబుద్దిన్ పాషా, ఏలేటి వినోద్ రెడ్డి, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లింగం, మల్లాపూర్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేష్, నియోజకవర్గ యువజన



కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోడిమ్యాల దీపక్ రాజ్, కార్యదర్శి అమ్ముల పవన్, ఇబ్రహీంపట్నం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, ఉప సర్పంచులు ఇప్పపల్లి గణేష్, రోడ్డ హారిక రాజు, మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్, డాక్టర్ అవుట్ల లక్ష్మ ణ్, కల్లెడ గంగాధర్, గూడ సోల్లు ముత్యం రెడ్డి, గోపిడి నరేష్, పరశురామ్, కూన సాయితేజ, పిట్టల వెంకటేష్, ఎట్టెం మల్లేష్, కాంగ్రెస్ నాయకులు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి-

మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్ కుమార్

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, ఖరీఫ్ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదు కావడం, భూగర్భ జలాల లభ్యత తగ్గడం, అక్టోబర్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు.ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో నిర్వహించిన ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల మార్పిడి, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ భూముల స్వభావం, నీటి లభ్యతను బట్టి కంది, పెసర, మినుము, శనగ, జొన్న, మొక్కజొన్నతో పాటు నువ్వులు, కుసుమ వంటి నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు.అలాగే తక్కువ పంటకాలం కలిగిన కూరగాయలు, ఆకుకూరల



సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆరుతడి పంటల సాగుతో నీటి వినియోగం, పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు తక్కువ సమయంలో ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొనకంటి వెంకట్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయికృప, స్థానిక రైతులు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ గర్భగుడి నిర్మాణానికి శిలాన్యాసం

వేద మంత్రోచ్చారణల మధ్య ప్రారంభమైన నూతన నిర్మాణ పనులుపాల్గొన్న మున్సిపల్ చైర్మన్ లింబాద్రి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త

:మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ నూతన నిర్మాణ పనుల్లో భాగంగా అమ్మవారి గర్భగుడి నిర్మాణానికి సంబంధించిన తొలి శిలా స్థాపన మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి గర్భగుడి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నూతన దుకాణ సముదాయాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం



గౌరవ అధ్యక్షుడు కోట గంగాధర్, దొంతుల రాజకుమార్, కోట సుమన్, మున్సిపల్ కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ కార్యవర్గ సభ్యులు, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిరుద్యోగ యువతకు అండగా ఉంటాం

వెల్మ కార్పొరేషన్ చైర్మన్ నర్సింగరావు

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:

మెట్‌పల్లి పట్టణంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో పట్టుదలతో కష్టపడి చదవాలని సూచించారు. యువతకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు



మహమ్మద్ రైస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బత్తుల నరేష్, అజయ్, నునుగొండ నరేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముఖీమ్, కోఆప్షన్ సభ్యులు మాధవరెడ్డి, గజం రవి, కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బర్ల సూరి తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కోరం లేక వాయిదా పడిన మెట్‌పల్లి మున్సిపల్ సమావేశం

అజెండా అంశాలపై జరగని చర్చ.. తీర్మానాలు పెండింగ్

మెట్‌పల్లి, ప్రభాతవార్త:

మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అయితే, సమావేశానికి అవసరమైన సంఖ్యలో కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో కోరం లేకుండా పోయింది.దీంతో సమావేశంలో అజెండా అంశాలపై చర్చ జరగకపోవడంతో పాటు ఎలాంటి తీర్మానాలు



చేయలేకపోయారని మెట్‌పల్లి పురపాలక సంఘం అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ లింబాద్రి కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, డి ఈ, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి వార్త



టపాకాయల దుకాణదారులు తప్పనిసరిగా జీఎస్టీ లైసెన్స్ పొందాలి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త

:దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో తాత్కాలికంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మెట్‌పల్లి మున్సిపల్ అధికారులు సూచించారు.ఉప వాణిజ్య పన్నుల శాఖ ఆదేశాల మేరకు టపాకాయల విక్రయదారులు ఎన్ఓసీ, లైసెన్స్‌తో పాటు జీఎస్టీ లైసెన్స్ కూడా తప్పనిసరిగా పొందాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే బాణసంచా విక్రయాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎర్రాపూర్ గ్రామ పంచాయతీని తనిఖీ చేసిన ఎంపీఓ

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:



ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్రాపూర్ గ్రామ పంచాయతీని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) రామకృష్ణ రాజు సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించి ధృవీకరించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడత (లి।) జాబితాపై విచారణ చేపట్టారు. గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పారిశుధ్య నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సల్కం మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగారెడ్డికి ఘన సన్మానం

మెట్ పల్లి అర్బన్, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఇటీవల నియామకం అయిన కొమిరెడ్డి లింగారెడ్డి ని శుక్రవారం మెట్ పల్లి న్యాయవాదులు శాలువా, పూలమాల తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి మాట్లాడుతూ, మాతోటి న్యాయవాది జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా నియామకం కావడం మాకెంతో గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని అకాంక్షి ంచారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు మెడిచెల్మల సుమలత, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు గంద్ర ప్రవీణ్ రావు, యం.డి. వల్లియొద్దీన్, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, నాంపల్లి మరుతి, పసునూరి సుదర్శన్, మామిడిపల్లి విజయలక్షి ్మ, నేరెళ్ల శ్రీధర్, తెడ్డు ఆనంద్, పసునూరి శ్రీనివాస్, నీరటి రమణ ఉన్నారు.

గోధూర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంపీడీవో గణేష్

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:



మండలంలోని గోధూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో సీహెచ్. గణేష్ గురువారం సందర్శించి పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఆయన, భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రతతో పాటు పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మధు, ప్రధానోపాధ్యాయురాలు కల్పన, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి అర్షద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: జిల్లాలో నూతన ఆసుపత్రుల భవన నిర్మాణ పనులను ప్రణాళికా ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల నిర్మాణం, జిల్లా కేంద్రంలోని జీ జీ హెచ్, ఏరియా ఆసుపత్రి, సీ హెచ్ సీ ల్లో వసతుల కల్పన తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పంచాయతీరాజ్ శాఖ, టీజీఎంఐడీసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో ఆసుపత్రుల భవన నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తుది దశలో ఉన్న భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని వసతులతో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని జీ జీ హెచ్, వేములవాడ ఏరియా ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట సీ హెచ్ సీ ల్లో కావాల్సిన వైద్యయంత్ర పరికరాలు, సామగ్రి, అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి



చేయించాలని ఆదేశించారు. ఇల్లంతకుంట సీ హెచ్ సీ నిర్మాణ పనులను గడువులోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 16 సబ్ సెంటర్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే 7 పూర్తి అయ్యాయి. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయని, రుద్రంగి మండల కేంద్రంలో పీహెచ్ సీ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని జిల్లా కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుభాషిణి, వైద్యులు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు విభిన్న అంశాల్లో విద్యార్థుల ప్రతిభ

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఉత్తమ చిత్రాలు గీసిన టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జేసీ బోయినపల్లి విద్యార్థులకు అభినంద

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

ప్రభుత్వ విద్యాలయాల లోని విద్యార్థులు విద్యతో పాటు విభిన్న అంశాల్లో ప్రతిభ చూపుతున్నారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. బోయినపల్లిలోని టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జేసీ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థులు వెంకటేష్ బాబు, కార్తీక్ శ్రీవాస్తవ్,రాణాప్రతాప్ గీసిన చిత్రాలను శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించి ఆ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మ్యూజిక్ లో ప్రతిభ చూపుతున్నారని కొనియాడారు. టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జేసీ బోయినపల్లి



విద్యార్థులు గురుకుల విద్యాసంస్థల రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ లో సైతం అర్హత సాధించారని వెల్లడించారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటుగా ఖాళీ సమయాల్లో విద్యాసంస్థల్లో ఉన్న టీచర్ల సహాయంతో తమకు ఇష్టం ఉన్న అంశాల్లో నైపుణ్యాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. క్రీడలు లేదా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మ్యూజిక్ లో నిత్యం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం, ఆర్ట్ టీచర్ వీణా దేవి విద్యార్థులు ఉన్నారు.

ఇది ఎల్నినో కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు బీఆర్ఎస్

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త :

రాష్ట్రంలో నెలకొన్నది ప్రకృతి విపత్తు వల్ల వచ్చిన ఎల్నినో కరువు కాదని, కాంగ్రెస్ అసమర్థ పాలన తెచ్చిన మానవ నిర్మిత కరువని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో సాగునీరు, రైతుబంధు, రైతుబీమా సకాలంలో అందించి అన్నదాతలకు భరోసానిచ్చారని గుర్తుచేశారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయకుండా దిగువకు వృథాగా వదిలేస్తున్నారని ఆరోపించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతుల నుంచి వరి సాగుపై సెల్ఫ్ డిక్లరేషన్ అడగడం శోచనీయమన్నారు. విపక్షాలపై నిరాధార విమర్శలు మాని, అన్నదాతలను ఆదుకునే దిశగా



చర్యలు చేపట్టాలని, వేములవాడ రాజన్న ఆలయాన్ని యాదాద్రి తరహాలో నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం భాజపా

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని భాజపా జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆరోపించారు. సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచే ఎన్నికల వ్యవస్థలో ఓటర్ల జాబితా సవరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందని, గతంలో కాంగ్రెస్ హయాంలోనూ అనేకసార్లు జరిగిందని గుర్తుచేశారు. జాబితాలో చనిపోయిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను తొలగించి పారదర్శకత తీసుకురావడాన్ని కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ కార్యక్రమం కాదని, కలెక్టర్



పర్యవేక్షణలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) రాజ్యాంగబద్ధంగా నిర్వహిస్తున్న విధి అని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మార్పులు, చేర్పులు, తొలగింపులు జరుగుతున్నాయని వివరించారు. ఈ సమావేశంలో పలువురు భాజపా నాయకులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం అజరామరం

జిల్లా కేంద్రంలో ఘనంగా కొవ్వొత్తుల ర్యాలీ

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి: ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన గాంధీ చౌక్ వరకు సాగింది. ఎస్పీ స్వయంగా కొవ్వొత్తి చేతబూని ముందు నడవగా, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అమరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ



రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా కర్తవ్య నిర్వహణలో అనువులు బాసిన పోలీసుల త్యాగఫలమే నేటి ప్రశాంత జీవనమని పేర్కొన్నారు. వారి సేవలను భావితరాలకు సగర్వంగా చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రతీ పౌరుడు బాధ్యతాయుతంగా మెలగాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, 2కే రన్, వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలు, ఓపెన్ హౌస్ వంటి వైవిధ్యభరిత కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త



మృతురాలి కుటుంబానికి గల్ఫ్ అసోసియేషన్ అండ

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన ధనుల మల్లవ్వ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. మల్లవ్వ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసి అండగా నిలిచారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలనే ఉద్దేశంతో గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు ఈ సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అనుమతి లేని బోర్లు వేస్తే కఠిన చర్యలు

తహసీల్దార్ రాచకట్ల సురేష్

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



ఇల్లంతకుంట మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రాచకట్ల సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఎల్నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని గ్రామాల్లో సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి బోర్‌వెల్స్ వేయరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు లేకుండా బోర్లు వేస్తే సంబంధిత వ్యక్తులపై వాల్టా చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూగర్భ జలాలు అడుగంటకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మండలంలోని బోర్‌వెల్ యజమానులు, రైతులు, ప్రజలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రాచకట్ల సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలకు పారదర్శక సేవలు అందించాలి

సైబర్ నేరాలు, గంజాయి పై అవగాహన పెంచాలి. ఎస్పీ మహేష్‌బి.గితే



తంగళ్ళపల్లి, ప్రభాతవార్త.

.తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణ, పెట్రోలింగ్, రౌడీషీటర్లపై నిఘా అంశాలను సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఎస్పిమాట్లాడుతూ ప్రతి ఫిర్యాదు పై వెంటనే స్పందించి పారదర్శక సేవలు అందించాలని, విజిబుల్ పోలీసింగ్ తో ప్రజల్లో భద్రతా భావం కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, చోరీలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్ పై ప్రత్యేక డ్రైవ్ లు చేపట్టాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ నాగేశ్వరరావు, ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

బాలల రక్షణే మన అందరి బాధ్యత

డీఎల్ఎస్ఏ కార్యదర్శి సరిత మట్ట

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ చెల్గల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్ట ఆధ్వర్యంలో విద్యార్థులకు పోక్సో చట్టం పై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు,దాడులు ఇతర దుర్వి నియోగాల నుంచి బాలబాలికలకు రక్షణ కల్పించేందుకే పోక్సో చట్టం అమలులో ఉందని స్పష్టం చేశారు.చట్టంలోని ముఖ్య నిబంధనలు, నేరస్థులకు పడే శిక్షలు,బాధిత పిల్లలకు లభించే రక్షణలు,హక్కుల గురించి వివరించారు. విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రత పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని,మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను గుర్తించాలని సూచించారు.ఎవరైనా తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు పాల్పడినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. బాలలపై జరిగే వేధింపులను దాచిపెట్టకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయడం ప్రతి ఒక్కరి



బాధ్యత అని,పిల్లల రక్షణ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం బాలల సంరక్షణ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రతి చిన్నారికి భద్రమైన వాతావరణంలో జీవించే హక్కు ఉందని,వారి గౌరవాన్ని,రక్షణను కాపాడటం సమాజ బాధ్యత అని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ సురేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన,ధైర్యాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థిక సాధికారత

ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో జగిత్యాల మండలం రూరల్ పొలాస,నర్సింగపూర్ గ్రామాలకు చెందిన ముస్లిం మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణీ చేశారు.స్వయం ఉపాధి కల్పన నిమిత్తం పొలాసకు చెందిన ఎండీ సైమా సమీర్, రహీమా బేగం ఖాజా మొహినోద్దీన్,నర్సింగపూర్ గ్రామానికి చెందిన అఫ్రీనా బేగం ఎండీ భాషాలకు ఒక్కొక్కరికి 50,000 వేల రూపాయల చొప్పున ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,మైనారిటీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.అభివృద్ధి చెందిన సంపన్న దేశాలలో సైతం అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యపడదని,అందుకే స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకరిస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యాపార, ఉపాధి రంగాల్లో రాణించాలని కోరారు.మహిళా సాధికారత,ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని,అందులో భాగంగానే యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్ సెటి ద్వారా మహిళలకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య,ఎంపీడీవో రమాదేవి,సర్పంచ్ మీల్కూరి శంకర్,మాజీ జెడ్పీటీసీ పెండెం రాములు,పార్టీ నాయకులు శ్రీరాం భిక్షపతి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేతోనే కుష్ట వ్యాధికి అడ్డుకట్ట

రాష్ట్ర అబ్జర్వర్ డాక్టర్ రాజు



జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ధరూర్ సబ్ సెంటర్‌లో శుక్రవారం కుష్ఠ వ్యాధి గుర్తింపు ప్రచారం కార్యక్రమాన్ని రాష్ట్ర అబ్జర్వర్ డాక్టర్ రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుజాత,జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే తీరును, లెప్రసీ కేసుల నమోదు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ,కుష్ఠ వ్యాధి పూర్తిగా నయం చేయదగినదని,ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు.శరీరంపై స్పర్శ లేని మచ్చలు, తిమ్మిర్లు,బుడిపెలు వంటి లక్షణాలు కనిపిస్తే దాచుకోకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే శాశ్వత వైకల్యాన్ని అరికట్టవచ్చని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు,మందులు అందిస్తున్నామని స్పష్టం చేశారు.చికిత్స ఆలస్యం చేస్తే నరాలు దెబ్బతిని కాళ్లు,చేతులు వంకరపోయే ప్రమాదం ఉన్నందున లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలని,ఆశా వర్కర్లు చేసే ఇంటింటి సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

మేడిగడ్డ కూలిపోవడానికి లోపభూయిష్ట డిజైనే కారణం

ప్రాణహిత జలాలు వృధాగా పోతున్నాయి

ఎల్‌నినో ప్రభావానికి బిఆర్ఎస్ కారణం

"రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు నిర్మల రెడ్డి..

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త..



కృష్ణా నది జలాల విషయంలో బిఆర్ ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ఆరోపణలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా నిర్మలా రెడ్డి ప్రకటన మాట్లాడుతూ ఈ సీజన్ లో అక్టోబర్ 2026 నాటికి కృష్ణా జలాల వినియోగం చూస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి తెలంగాణ 127.57 టీఎంసీలు వినియోగిస్తే, ఆంధ్రప్రదేశ్ 72.237 టీఎంసీలు మాత్రమే వినియోగించిందని,అలాగే నాగార్జునసాగర్ నుంచి తెలంగాణ 41.908 టీఎంసీలు, ఏపీ 17.207 టీఎంసీలు వినియోగించిందన్నారు.దీన్ని బట్టి చూస్తే తెలంగాణ కంటే ఏపీ ఎక్కువ నీళ్ల వాడుతోందని బిఆర్ ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని నిర్మలా రెడ్డి ఖండించారు. "మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు కేంద్ర జలశక్తి శాఖ నియమించిన టెక్నికల్ ఓవర్ సైట్ కమిటీ మార్గదర్శకాల ప్రకారం జరుగుతున్నాయని ఆమె వివరించారు. మేడిగడ్డ కూలిపోవడానికి లోపభూయిష్ట డిజైన్, నిర్మాణమే కారణమని ఆమె స్పష్టం చేశారు.మేడిగడ్డ కూలిపోవడం వల్ల ప్రాణహిత జలాలను నిల్వ చేయలేకపోతున్నాం, నీళ్లన్నీ దిగువకు వెళ్లిపోతున్నాయన్నారు.తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండటానికి ఇది కూడా ఒక కారణమని,ఇలాంటి పరిస్థితికి కారణమైన బిఆర్ఎస్ పార్టీనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని నిర్మలా రెడ్డి ఏద్దేవా చేశారు.ప్రజలు రాజకీయ ఆరోపణలు కాకుండా వాస్తవాలు, గణాంకాలు, నిపుణుల నివేదికలు చూసి నిజాలు తెలుసుకోవాలని నిర్మల రెడ్డి పిలుపునిచ్చారు.

జగిత్యాల వార్త



మోరపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ మోరపల్లి గ్రామానికి చెందిన తెడ్డు సంధ్యడేవిడ్ ల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ ఇల్లును అధికారికంగా ప్రారంభించి, సంధ్య డేవిడ్ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆ కుటుంబానికి ఎమ్మెల్యే చీరను కానుకగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట రాజేందర్,మాజీ సర్పంచ్ బొల్లె గంగారం,మాజీ ఎంపీటీసీ భూమారెడ్డి,నాయకులు సదానందం, కాంతయ్య,మైపాల్,విజయ్,గంగేష్, కొమురయ్యలతో పాటు పలువురు నాయకులు, స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బియ్యం ధరలపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు.....

జిల్లా మంత్రి, అధికార యంత్రాంగం మోనమెందుకు?

సీపీఎం నేత ఉమా మహేష్



జగిత్యాల టౌన్,ప్రభాత వార్త.:రాష్ట్ర వ్యాప్తంగా బియ్యం ధరల నియంత్రణ కోసం అధికారులు దాడులు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో మాత్రం జిల్లా యంత్రాంగం, జిల్లా మంత్రి మౌనంగా ఉండటానికి కారణమేంటని న్యాయ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు, సీపీఎం నాయకులు, న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్ ప్రశ్నించారు. శుక్రవారం జగిత్యాలలో ఆయన మాట్లాడుతూ... బియ్యం ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, సంబం ధిత అధికారులు ఎందుకు సమర్థవంతమైన తనిఖీలు నిర్వహించడం లేదని ఆయన నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా చర్యలు తీసుకుంటున్నప్పుడు జగిత్యాల జిల్లాలో మాత్రం నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు.జిల్లాలోని బియ్యం మిల్లులు, గోదాములు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి, అధిక ధరలకు విక్రయాలు లేదా ఇతర అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై స్పందించాల్సిన జిల్లా మంత్రి, అధికారులు మౌనం వీడి ప్రజలకు సమాధానం చెప్పాలి. బియ్యం ధరల నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరఫున పోరాటం ఉధృతం చేస్తామని కూర్మాచలం ఉమా మహేష్ హెచ్చరించారు.

పేద విద్యార్థులకు నాసిరకం దుస్తులా?

ప్రభుత్వ తీరుపై లింగంపేట్ శ్రీనివాస్ మండిపాటు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల జిల్లా 13వ వార్డు లింగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన స్కూల్ యూనిఫామ్స్ నాణ్యతపై జగిత్యాల బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ లింగంపేట్ శ్రీనివాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.పాఠశాలలో విద్యార్థులకు అందజేసిన యూనిఫామ్స్‌లో గుండీలు,హుక్స్ సరిగా లేకపోవడం,కొలతలు తప్పుగా ఉండటంతో పాటు వస్త్రం నాణ్యతలో తీవ్ర లోపాలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యత లేని దుస్తులు అందించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు.విద్యార్థుల భవిష్యత్తు,సౌకర్యాన్ని పక్కనబెట్టి నాసిరకం యూనిఫామ్స్ అందించిన బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.నిరుపేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే నాణ్యతా ప్రమాణాలతో కూడిన కొత్త స్కూల్ యూనిఫామ్స్‌ను సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ !! సైన్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్ ప్రభాతవార్త

:కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ !! సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మెగా జాబ్ మేళా - 2026 నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఈరోజు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఇటువంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థులతో పాటు కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఈ జాబ్ మేళా మంచి అవకాశమని పేర్కొన్నారు.2026 నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించబడుతుంది. ఈ జాబ్ మేళాలో 500కు పైగా ఉద్యోగ ఖాళీలతో అమర రాజా, రేడియంట్, రెసొల్యూట్, అంబర్ రెసోజెట్, ఓరియంట్ ఎలక్ట్రిక్, అవిష్కరణ్, సైయెంట్, ప్లెక్సిడర్ ఎలక్ట్రిక్, బ్రైట్‌గ్రిడ్ టెక్నాలజీస్, ప్రీమియర్ ఎనర్జీస్, రెన్యూసిస్, ఓఎస్ఐ, ఫ్రాంటియర్ ఎనర్జీ, రాపిస్కాన్ సిస్టమ్స్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి.ఉద్యోగార్థులు తమ రెజ్యూమ్, విద్యార్హతల



ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు మరియు జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీ టి. రాజయ్య, శ్రీ పి. నితిన్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ మరియు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ బి. సతీష్ కుమార్, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, టీజీసీజీటీఏ అధ్యక్షులు డాక్టర్ కె. సురేందర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ టి. శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి శ్రీ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ కుమార్ సహకారంతో డంపు యార్డు ప్రక్షాళనకు 17 కోట్లు నిధులు తెచ్చాం

ఇంకా నిధులు కేటాయించి..డంపు యార్డు కు శాశ్వత పరిష్కారం చూపుతాం.

కరీంనగర్,ప్రభాతవార్త :

డంపు యార్డు సమస్య శాశ్వత పరిష్కారం కొసం తమ పాలకవర్గం తీస్కుంటున్న చర్యలను చూసి... కొంత మంది కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు... మా పాలకవర్గానికి ఎక్కడ పేరు వస్తదో అని... ప్రజల్లో ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం 41 వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. కట్టరాంపూర్ లో డిప్యూటీ మేయర్ కార్పోరేటర్ నాంపల్లి కవిత శ్రీనివాస్ తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన రూ. 12 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మేయర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. డివిజన్ కాలనీల్లో పాదయాత్ర చేపట్టి స్థానిక ప్రజల సమస్యలను తనిఖీ చేసి పరిశీలించారు. ప్రజలు, కార్పోరేటర్ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారం పై ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో కొంత మంది నాయకులకు ఇంత కాలం డంపు యార్డు సమస్య, స్థానిక ప్రజల ఇబ్బందులు కనబడలేదు కానీ. తమ పాలకవర్గం డంపు యార్డు శాశ్వత పరిష్కారం కొసం 17 కోట్లు నిధులు విడుదల చేసి బయోమైనింగ్ ప్రక్రియ చేపడుతుంటే.... కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి మా పాలకవర్గం కు ఎక్కడ పేరు వస్తదో అని... ప్రజల్లో ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 20 సంవత్సరాలు పదవుల్లో ఉండి ఏం చేయలేక... సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తున్నారని. మాటలు చెప్పడం కాదు... మా పాలకవర్గం ఒక ప్రణాళిక తో గత 30 సంవత్సరాల డంపు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నట్లుఅవసరాలను బట్టి మరిన్ని నిధులు కేటాయించి అయినా డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. కొంత



మంది ప్రతిపక్ష నాయకులు అధికారంలో ఉండి కూడ డంపు యార్డు సమస్య పరిష్కారం కు ఏం చేయలేక పోయారని అన్నారు. ఇప్పుడు మా పాలకవర్గం ప్రణాళికతో ముందుకు వెళ్తూ... డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేస్తుంటే ఓర్వలేక ప్రజల మెప్పు కొసం పాకులాడుతున్నారని తెలిపారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ 17 కోట్లతో బయోమైనింగ్ ప్రక్రియ చేపడుతామని తెలిపారు. అవసరం మేరకు మరిన్ని నిధులు కూడ కేటాయించి... సాధ్యమైనంత తొందరలోనే స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని... ఆ దిశగా మా పాలకవర్గం పని చేస్తుందని ఇప్పటికి టెండర్ ప్రక్రియను పూర్తి చేశామని... త్వరలోనే బయోమైనింగ్ ప్రక్రియ పనులు ప్రారంభం చేస్తామన్నారు. అంతే కాకుండా డంపింగ్ యార్డు కు యూసిఎఫ్ స్కీంలో కూడ 80 కోట్లు కేటాయించామని తెలిపారు. త్వరలోనే యూసిఎఫ్ టెండర్లు పూర్తి చేసి... చెత్త ప్రాసెసింగ్ పనులను కూడ ప్రారంభం చేస్తామన్నారు. రెండు విధాలుగా డంపుయార్డులో ముమ్మరంగా పనులు చేసి... డంపింగ్ యార్డు ను ప్రక్షాళన చేస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యంగా మేము పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ లచ్చిరెడ్డి, ఏఈ భీంవర్ధన్ రెడ్డి, కాలనీవాసులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మలకు సామాజిక న్యాయం కల్పించాలి

ప్రత్యేక కార్పొరేషన్, ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రభాతవార్తకరీంనగర్ రూరల్

కరీంనగర్ రూరల్: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సామాజిక వర్గానికి సామాజిక న్యాయం కల్పించాలని, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్, ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బ్రహ్మశ్రీ పాములపర్తి వేణుగోపాల చారి అధ్యక్షతన శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం సమావేశానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాలకు చెందిన సంఘం అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొని విశ్వకర్మ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ప్రత్యేక కార్పొరేషన్, ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఇండస్ట్రియల్ లోన్లు అందించాలని కోరారు.విశ్వకర్మలకు విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని నాయకులు పేర్కొన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, 55 సంవత్సరాలు పైబడిన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. సామాజిక వర్గానికి తగిన గుర్తింపు, సంక్షేమ ఫలాలు అందేలా సంఘం నాయకులు ఐక్యంగా, పటిష్టంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా సంఘటితంగా ముందుకు సాగాలని అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



పాలికోజు నరసింహా చారి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాంపల్లి సోమచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రోజు రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కాసిపేట మురళి, నాగుర్ల మురళి, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు చాన గుండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే కరీంనగర్ జిల్లా 16 మండలాల అధ్యక్షులు, జవ్వాజి వెంకటలక్ష్మి, బీజాళ్ళ సుజాత, ఇమ్మడోజు భాగ్యలక్ష్మి, స్వరూప, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బిమోజు సురేంద్ర చారి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు చందనగిరి గోపాల్, ప్రధాన కార్యదర్శి సనుగుల సత్యం, కోశాధికారి కొలకాని శంకర్, శ్రీమంతుల సదాచారి తదితర సంఘం నాయకులు, సభ్యులు హాజరయ్యారు.విశ్వకర్మల ఐక్యత, హక్కుల సాధన, సామాజిక అభివృద్ధి లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. పెద్ద సంఖ్యలో విశ్వకర్మ సామాజిక వర్గ సభ్యులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.



అండర్19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన తేజస్ విద్యార్థి

కొత్తపల్లి, ప్రభాత వార్త



కొత్తపల్లి లోని తేజస్ కళాశాలకు చెందిన విద్యార్థి కె. అభిషేక్ అండర్ 19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు.ఇటీవల కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన అండర్19 క్రికెట్ సెలక్షన్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి అభిషేక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తేజస్ డిఫెన్స్ అకాడమీ జూనియర్ కళాశాల చైర్మన్ సిహెచ్ సతీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎంపికవడం ఎంత గర్వకారణం అని విద్యార్థి అభిషేక్ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవడాని అవసరమైన సదుపాయాలు సమకూర్చి ప్రోత్సహిస్తామని వెల్లడించారుఈ నెల 31 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు తరఫున అభిషేక్ ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారుఈ సందర్భంగా అభిషేక్‌ను కళాశాల చైర్మన్ సతీష్ రావు క్రికెట్ కోచ్ నరేన్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పారమిత హెరిటేజ్ పాఠశాలలో షూటింగ్ అకాడమీ ప్రారంభం

కరీంనగర్ ఎడ్యుకేషన్ప్రభాతవార్త



:పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ అకాడమీని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షూటింగ్ క్రీడ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, సమయానుకూల నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం పెరుగుతాయని, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హన్మంత రావు,ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, షూటింగ్ రేంజ్ ఆఫీసర్ బొప్పు సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎంసి చెక్ పోస్టు తనిఖీ చేసిన అధికారులు

మానకొండూర్, ప్రభాతవార్త



: మానకొండూర్ మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టును శుక్రవారం అధికారులు తనిఖీ చేశారు.మానకొండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం,డిఎంఓ షాబుద్దీన్, మార్కెట్ సెక్రటరీ శ్రవణ్ చెక్ పోస్టును తనిఖీ చేసి అక్కడ పని చేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.సన్న వడ్లు,దొడ్డు వడ్లకు సంబంధించి మార్కెట్ ఫీజు (ఎంఎఫ్) వసూళ్లను పరిశీలించారు.యుపిఐ లావాదేవీలను ఎంఎఫ్ రసీదులతో క్రాస్ చెక్ చేసి పరిశీలించారు.మార్కెట్ ఫీజు వసూలు చేసే ముందు చెక్ పోస్ట్ సిబ్బంది దొడ్డు ధాన్యం నమూనాలను భౌతికంగా పరిశీలించాలని ఆదేశించారు.ధాన్యం రవాణా చేస్తున్న వాహనాల గురించి అడిగి తెలుసుకున్నారు.గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఈసారి రూ.4,24,800 ఎక్కువ వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

జమ్మికుంటలో చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనాలకు భారీ ఏర్పాట్లు..

అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

జమ్మికుంట / హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో స్థానిక బొమ్మలగుడి ఆవరణలో నవంబర్ 2వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జమ్మికుంట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ (దిలీప్), 30 వార్డు కౌన్సిలర్ చందా రాజు, అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు కోరారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భారీ గేట్ల ఏర్పాటు సహా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం జమ్మికుంట గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని



కేటాయించారు. అదేవిధంగా ప్రవచన కార్యక్రమానికి హాజరయ్యే భక్తులందరూ ముందుగానే కార్యక్రమ ప్రాంగణానికి చేరుకోవాలని, తమకు కేటాయించిన సీట్లలోనే కూర్చొని క్రమశిక్షణ పాటించాలని అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ప్రవచన కార్యక్రమం ప్రారంభమైన తర్వాత ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి ఒక్కరూ నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మిక ప్రవచనాలను ఆస్వాదిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భక్తులకు పిలుపునిచ్చారు.

ఇళ్ల మీదుగా వెళ్తున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించాలి

విద్యుత్ శాఖ ఏఈ కి వినతిపత్రం సమర్పించిన పాతకాల ప్రవీణ్.

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఎస్ సి కాలనీ కేశవపురం గ్రామంలో ఇళ్ల మీదుగా వెళ్తున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించాలనీ పాతకాల ప్రవీణ్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ఉన్న కేశవపురం గ్రామం ఎస్ సి కాలనీ మీదుగా వీణవంక సబ్‌స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ గ్రామస్తుల ఇళ్ల మీదుగా వెళ్తుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ విద్యుత్ లైన్ కారణంగా కొంతకాలం క్రితం ఒకరు ప్రాణాలు కోల్పోయారని, అంతేకాకుండా అప్పుడప్పుడు విద్యుత్ వైర్ల నుంచి మంటలు రావడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు, చిన్నపిల్లలు, వృద్ధుల భద్రతపై తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో



పాతకాల ప్రవీణ్ జమ్మికుంట విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)ని కలిసి వినతిపత్రం సమర్పించారు. కేశవపురం గ్రామంలోని ఇళ్ల మీదుగా వెళ్తున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అవసరమైన సాంకేతిక పరిశీలన అనంతరం విద్యుత్ లైన్‌ను సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గంలోకి మార్చాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ భద్రతే ముఖ్యమని, అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని పాతకాల ప్రవీణ్ విద్యుత్ శాఖ అధికారులను కోరారు

జమ్మికుంట రేషన్ కార్డుల్లో భారీ తప్పిదం

మోత్కులగూడెం బదులు కోరపల్లిగా నమోదు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

ఖికొండ నాలుకకు మందు వేస్తే... ఉన్న నాలుక ఊడిపోయినట్లుఖి తయారైంది అధికారుల తీరు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న కొత్త ఫుడ్ సెక్యూరిటీ రేషన్ కార్డులు తప్పుల తడకగా మారడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఏకంగా ఊరి పేరే తప్పుగా నమోదు కావడంతో ప్రభుత్వ యంత్రాంగం నిరక్ష్యం కళ్లకు కడుతోంది. వివరాల ప్రకారం.... జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి (9, 10, 11వ వార్డులు) చెందిన సుమారు 1,200 ఫుడ్ సెక్యూరిటీ రేషన్ కార్డుల్లో గ్రామం పేరు తప్పుగా నమోదు కావడం స్థానికంగా ఆందోళన రేకెత్తిస్తోంది. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఇటీవల పంపిణీ చేసిన కొత్త కార్డుల్లో ఖిమోత్కులగూడెంఖి అని ఉండాల్సిన చోట ఖికోరపల్లిఖి గ్రామంగా నమోదైంది. అధికారుల నిరక్ష్యమో, లేక డేటా నమోదులో జరిగిన పొరపాటో తెలియదు కానీ, ఊరి పేరు



మారిపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు అందడంలో ఇబ్బందులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్డుల్లో దొర్లిన తప్పులను సంబంధిత అధికారులు వెంటనే గుర్తించి, మోత్కులగూడెం పేరుతో సరైన వివరాలున్న కొత్త రేషన్ కార్డులను అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు వెంటనే తప్పులు సరిదిద్దాలి...(మర్రి తిరుపతి, మోత్కులగూడెం వాసి)మా గ్రామానికి చెందిన 1200కు పైగా రేషన్ కార్డుల్లో మా ఊరి పేరుకు బదులు కోరపల్లి అని తప్పుగా వచ్చింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ తప్పులను సరిదిద్ది, మాకు సరైన రేషన్ కార్డులు అందించాలి.

పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించిన ఆల్ఫోర్స్ విద్యార్థులు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

పుస్తక పరిజ్ఞానంతో పాటు విద్యార్థులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించేందుకు విజ్ఞాన పర్యటనలు ఎంతగానో దోహదపడతాయని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. హుజురాబాద్‌లోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా శుక్రవారం తుమ్మనపల్లి గ్రామంలోని పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో విద్యార్థులు మల్బరీ సాగు, పట్టు పురుగుల జీవన చక్రం, గూళ్ల అల్లే విధానం, పట్టుదారం సేకరణ ప్రక్రియలను ఆసక్తిగా పరిశీలించారు. స్థానిక రైతు బొక్కల వేణుగోపాల్ విద్యార్థులకు పట్టుపురుగుల పెంపకంలోని వివిధ దశలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపాధి అవకాశాలను క్షేత్రస్థాయిలో వివరించి



వారి సందేహాలను నివృత్తి చేశారు. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఎంపీడీవోను సన్మానించిన ఆలయ చైర్మన్..

ఇల్లందకుంట, ప్రభాతవార్త: ఇటీవల ఇల్లంతకుంట మండల ఎంపీడీవో (మండల పరిషత్ అభివృద్ధి అధికారి) గా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ మల్హోత్రను శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఇల్లంతకుంట గ్రామపంచాయతీలో మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇల్లంతకుంట మండల అభివృద్ధి గ్రామాల పురోగతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ తన పదవీ కాలాన్ని విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దార సురేష్, ధర్మకర్త గొడిశాల పరమేష్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వార్త

గ్రామాల్లో అంటరానితనం రూపుమాపాలి.

డిప్యూటీ తహసిల్దార్ శంకర్



జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త

జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ యశోద శంకర్ ఆధ్వర్యంలో సర్పంచ్ కందికట్ల మధు సుధన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ శంకర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ కుల మతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని అంటరాని తనం రూపు మపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ గడ్డం శంకర్ జిపిఓ మధుకర్ పంచాయితీ సెక్రటరీ రామారావు వార్డు సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

బాలల భద్రతకు చట్టాలపై అవగాహనే రక్షణ కవచం

ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్, డాక్టర్ నరేందర్ రెడ్డి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడానికి, వారి హక్కుల పరిరక్షణకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. హుజురాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి పిబి కిరణ్ కుమార్ హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి కిరణ్ కుమార్ మాట్లాడుతూ... పోక్సో చట్టం ప్రాముఖ్యతను, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మధ్య వ్యత్యాసాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడటం తీవ్రమైన నేరమని, ఇలాంటి ఘటనలు జరిగితే దాచిపెట్టకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పిల్లల భద్రత కేవలం తల్లిదండ్రులదే కాకుండా ఉపాధ్యాయులు, సమాజం సమిష్టి బాధ్యత అని డాక్టర్ నరేందర్ రెడ్డి గుర్తుచేశారు. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ద్వారా వారి హక్కులను సమర్థవంతంగా కాపాడవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేద అంత్యక్రియలకు పది వేల ఆర్థిక సహాయం.

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండలము నర్సింగాపూర్ గ్రామానికి చెందిన శ్రీమంతుల లక్ష్మి శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందింది .కాగా ఆత్యక్రియల నిర్వహణకు ఇబ్బందిగా ఉండడంతో అదే గ్రామ హరిహర ట్రస్ట్ పోషణ సమితిని సహాయం చేయాలని కోరగా, మానవత దృక్పథంతో స్పందించిన పోషణ సమితి మృతురాలి కుటుంబసభ్యులకు పదివేలు అందించారు .మృతురాలి బంధువులకు భోజన సదుపాయం కల్పించారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి



పెద్దపల్లి, ప్రభాతవార్త: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగి సాగులో రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని తేమ సంరక్షణ పద్ధతులు పాటించాలని రైతు విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి శాస్త్రవేత్త, సమన్వయకర్త, ఎల్ నినో జిల్లా నోడల్ అధికారి డా. ఓదెల సంపత్ సూచించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రబీ సీజన్‌లో జిల్లాలోని సాగునీటి వనరులు, నేలలో ఉన్న తేమ, వాతావరణ పరిస్థితులను పరిశీలించి పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని తెలిపారు. వరికి బదులుగా జొన్న, మొక్కజొన్న, శనగ, పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు, కంది తదితర స్వల్పకాలిక పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలని పేర్కొన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుతో నీటి అవసరాన్ని తగ్గించడమే కాకుండా నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. పంట కోత అనంతరం మిగిలిన అవశేషాలను పొలంలోనే ఉంచి మల్చింగ్‌గా వినియోగించాలని, వాటిని కాల్చడం వల్ల కలిగే నష్టాన్ని నివారించాలని సూచించారు. అంతరకృషి, కలుపు నివారణను అవసరమైన సమయంలో చేపట్టి నేలలోని తేమను పంటకు అందుబాటులో ఉంచాలన్నారు. స్ప్రింక్లర్, డ్రిప్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను అందుబాటులో ఉన్నచోట్ల ఉపయోగించి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవాలని తెలిపారు. పంట ఎంపికకు ముందే నేలలోని తేమ, నీటి లభ్యతను అంచనా వేయాలని, తక్కువ కాలపరిమితి, తక్కువ నీటి అవసరం కలిగిన వంగడాలను ఎంచుకోవాలని సూచించారు. వర్షపాతంలో హెచ్చుతగ్గులు, వాతావరణ అనిశ్చితి, నీటి లభ్యతలో మార్పుల వల్ల ఎదురయ్యే సాగు నష్టాలను తగ్గించేందుకు ఒకే పంటకు పరిమితం కాకుండా విభిన్న పంటలను సాగు చేయాలని డా. సంపత్ తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు విజ్ఞాన కేంద్రం పెద్దపల్లిని సంప్రదించి తమ ప్రాంతానికి సరిపోయే రబీ పంటలు, విత్తనాలు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై సాంకేతిక సూచనలు పొందాలని కోరారు.

చిరు వ్యాపారుల ఉపాధికి భరోసా ఏదీ?

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దిష్టిబొమ్మ దగ్ధం.. పలువురి అరెస్టు

గోదావరిఖని, ప్రభాతవార్త:

అభివృద్ధి పనుల పేరుతో దుకాణాలు తొలగించిన చిరు వ్యాపారులకు తిరిగి ఉపాధి కల్పించడంలో జాప్యం ఎందుకని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు ప్రశ్నించారు. ఎల్బీనగర్, తిలక్‌నగర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల పనులను వెంటనే పూర్తి చేసి, గతంలో అక్కడ వ్యాపారాలు నిర్వహించిన అర్హులందరికీ దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మాణాలు నిలిచిపోవడాన్ని నిరసిస్తూ స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనుల పేరుతో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి, తిరిగి శాశ్వత దుకాణాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. తిలక్‌నగర్ వ్యాపారులు రెండేళ్లుగా, ఎల్బీనగర్ వ్యాపారులు ఆరు నుంచి ఏడు నెలలుగా ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ఎల్బీనగర్ కాంప్లెక్స్ నిర్మాణంలో అవినీతి ఆరోపణలతో పనులు నిలిపివేసి, అసలైన లబ్ధిదారులకు దుకాణాలు కేటాయించకపోవడం అన్యాయమని విమర్శించారు.గతంలో వ్యాపారాలు నిర్వహించిన వారి వివరాలను సేకరించి అర్హుల జాబితా ప్రకటించాలని, కాంప్లెక్స్‌ల నిర్మాణాలు పూర్తి చేసి పారదర్శకంగా దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్పందించకపోతే మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన సందర్భంగా 41వ డివిజన్ కార్పొరేటర్, సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కాపురి సూర్య, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.



ఆడబిడ్డల పెళ్లిళ్లకు
అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

అంతర్గాం, ప్రభాత వార్త : సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకం ద్వారా ఆడబిడ్డ ల పెళ్లిళ్లకు అండగా నిలుస్తున్నదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ అన్నారు. శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బ్రాహ్మణపల్లి రైతు వేదికలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి ఈ మేరకు మాట్లాడారు. రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా రుణాలు, వరి దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కు మహిళలకు అండగా నిలుస్తున్నదని పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కార్యక్రమం లో తహసీల్దార్ పడాల ప్రసాద్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం కిరణ్ కుమార్ గౌడ్,జిల్లా కాంగ్రెస్ నాయకులు పెండ్యాల మహేష్, పూదరి సత్తయ్య గౌడ్, ఉరిమెట్ల రాజలింగం, సంఘనవేణి శేఖర్, సర్పంచ్ లు ముక్కెర రాజమొగిలి, ఆరుముల్లా మాధవి మల్లేష్, లోకేష్, నక్క రాజ్ కుమార్ యాదవ్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

అమరుల త్యాగం అజరామరం

జిల్లా కేంద్రంలో ఘనంగా కొవ్వొత్తుల ర్యాలీ... శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి: ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన గాంధీ చౌక్ వరకు సాగింది. ఎస్పీ స్వయంగా కొవ్వొత్తి చేతబూని ముందు నడవగా, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అమరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా కర్తవ్య నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగఫలమే నేటి ప్రశాంత జీవనమని పేర్కొన్నారు. వారి సేవలను భావితరాలకు సగర్వంగా చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రతీ పౌరుడు బాధ్యతాయుతంగా మెలగాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, 2కే రన్, వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలు, ఓపెన్ హౌస్ వంటి వైవిధ్యభరిత కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ స్కూల్
ఉపాధ్యాయుల ఉద్యమ బాట

సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్!

జూలపల్లి,ప్రభాతవార్త: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూల్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఎమ్మెస్ జే ఎ సి ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం జూలపల్లి మండలం పెద్దాపూర్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాల ఆవరణలో శాంతియుతంగా నిరసన తెలిపారు.ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెద్దపల్లి వార్త



ఎల్‌నినో వేళ..
ప్రత్యామ్నాయ పంటలే మేలు..!

మెడిపల్లిలో రైతులకు అవగాహన

ఎన్టీపీసీ,ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావంతో యాసంగిలో నీటి కొరత ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మెడిపల్లి రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి కే. ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ బి. భాస్కర్‌రావు మాట్లాడుతూ కూరగాయలు, నూనెగింజల పంటల సాగుతో పాటు బిందు సేద్యం, మల్చింగ్ ద్వారా నీటిని ఆదా చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారి కంతా రావు మాట్లాడుతూ పెసర, మినుము, శనగ, నువ్వులు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. అనంతరం గుజరాత్‌లోని బనాస్‌కాంత నుంచి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు.



కాచాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం

జూలపల్లి,ప్రభాత వార్త: జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ.. చట్టాలు,పౌర హక్కులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ చేరాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తమ హక్కులు,బాధ్యతలపై పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు.సమాజంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్,ఉప సర్పంచ్ దాడి మనోహర్ యాదవ్,ఆర్ ఐ మల్లికార్జున్ రావు,జిపిఓ సత్యం,పంచాయతీ కార్యదర్శి విజయ్,ఎ ఎస్ఐ లక్ష్మి నారాయణ,గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దలు,మహిళలు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే

ఎల్ నినో ప్రభావం తీవ్రం నీటిని పొదుపుగా వాడుకోవాలి .. చొప్పదండి సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి

చొప్పదండి,ప్రభాతవార్త: మండలంలోని మంగళపల్లి గ్రామంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మండల కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల భారాస ప్రభుత్వంలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందించడంతో పాటు సన్న బియ్యంతో వారి కడుపు నింపుతున్నామన్నారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం కృషి, పట్టుదలతో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు దూసుకెళ్తుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాబోవు రోజుల్లో తీవ్రమైన కరువు ఏర్పడనుందని నీటి నిలువలు తగ్గి సాగునీటికి తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున దాని ప్రభావాన్ని కొంతమేర తగ్గించడానికి నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను సాగుచేయాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంగళపల్లి సర్పంచ్ పెద్దేల్లి శారద సురేష్, ఉప సర్పంచ్ ఏవన్ రెడ్డి, చొప్పదండి మున్సిపల్ చైర్ పర్సన్ వడ్నూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్, కౌన్సిలర్స్ గుర్రం సుజీత్ రెడ్డి, ముద్దం రాజేశ్వరి తిరుపతి గౌడ్, పిట్టల వెంకటేష్, కొలిమికుంట సర్పంచ్ చొక్కాల తిరుపతి, మాజీ సర్పంచ్ వెల్మ తిరుపతి రెడ్డి, వార్డ్ సభ్యులు, నాయకులు నెరుమట్ల మల్లేశం, వెల్మ కృష్ణ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సోమిడి శ్రీనివాస్,నల్లాల అఖిల్, బండారి రాజేష్, గ్రామ ప్రజలు నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే పాలకవర్గ లక్ష్యం

మున్సిపల్ చైర్ పర్సన్ వడ్నూరి సరితా శ్రీనివాస్

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో ప్రజా సమస్యలను పరిష్కరించడమే చొప్పదండి మున్సిపల్ పాలకవర్గ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ వడ్నూరి సరిత శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆరవ వార్డులోని శాంతినగర్ వీధిలో డ్రైనేజీ నిర్మాణం పనులను కౌన్సిలర్ ఒలుగొత్తుల సురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణం పనులను చైర్ పర్సన్ వడ్నూరి సరితా శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పాలకవర్గం ముందుకు సాగుతుందని, అన్ని వార్డులలో మౌలిక సదుపాయాలను కల్పించడమే మా ముందు ఉన్న ప్రధాన సమస్య అని వారు పేర్కొన్నారు. ప్రజల సమస్య మా బాధ్యతగా తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షులు గుర్రం సుజిత్ రెడ్డి, కౌన్సిలర్లు చిన్న అర్చన శ్రవణ్ కుమార్, కొత్త సుమలత గంగారెడ్డి, రాజన్నల రాజు, గుర్రం రాజేందర్ రెడ్డి, ముద్దం రాజేశ్వరి తిరుపతి, జిట్ట మంగ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.







మల్యాల పంచాయతీని
సందర్శించిన ట్రైనీ కలెక్టర్

మల్యాల, ప్రభాతవార్త: మల్యాల మేజర్ గ్రామపంచాయతీని శుక్రవారం ఐఏఎస్ అధికారి శిక్షణ కలెక్టర్ హరిణి సందర్శించారు, ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పరిపాలన, రికార్డులు, పరిపాలనకు సంబంధించిన వివిధ అంశాల తో పాటు పంచాయతి రాజ్ పరిధిలోని పంచాయతీలకు కలిగి ఉన్న అధికారాలు విధులు పాలన వంటి అంశాలను పరిశీలించారు, ట్రైన్ కలెక్టర్ హరిణి తో పాటు జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్, పంచాయతీ ఈవో సంగెం శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ వై, బాబు, రమేష్, ఖాన్ , నరేష్, పూజిత పాల్గొన్నారు, ఈ సందర్భంగా, గ్రామపంచాయతీ ఆధ్వర్యం లో ట్రైని కలెక్టర్ కు శాలువా తో సన్మానించారు, అనంతరం వన నర్సరీ తో పాటు కస్తూర్బా పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడిన అనంతరం వారితో కలిసి లంచ్ లో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోట్ల జయ ప్రసాద్, వార్డు సభ్యులు శనిగరం తిరుపతి పాల్గొన్నారు,

విబిజిరామ్‌జితో
భూగర్భ జలాలు పెంచుకోవాలి

మల్యాల ,ప్రభాతవార్త; వి జి బి రామ్ జి పథకంతో రైతులు పంట కుంటల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెంపొందించుకొని ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆరుతడి పంటలను వేసుకోవాలని మల్యాల మండలం వ్యవసాయ అధికారి చంద్ర దీపక్ సూచించారు, శుక్రవారంమల్యాల మండలం లంబాడిపల్లి లో కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు, ఏలినినో ప్రభావము ఎక్కువగా ఉండటంవల్ల పంటలను సంరక్షించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని,వరి పంట కోత తర్వాత పంట అవశేషాలను కాల్చడం వల్ల నేల ఆరోగ్యం, పర్యావరణం కాలుష్యం జరుగుతుందనీ, వరి అవశేషాలను పశుగ్రాసంగా లేదా నేలలో కలియ దున్ని నేల సారం పెంచాలని వివరించారు, యాసంగిలో ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర, మినుములు, జొన్న శనగలు,నూనె గింజలు, ప్రొద్దుతిరుగుడు, వేరుశనగ సాగు చేసుకోవాలన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరాఠీ సంధ్య రాణి, సత్తయ్య, ఏఈఓ వరుణ్ పాల్గొన్నారు,

పిఎంశ్రీ ప్రధానోపాధ్యాయులకు
బెంగళూరులో విద్యా నైపుణ్యాలపై అవగాహన

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల జిల్లాలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులలో నాయకత్వ లక్షణాలు, పరిపాలనా నైపుణ్యాలు,విద్యా నిర్వహణ సామర్థ్యాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా బెంగళూరులోని ప్రతిష్టాత్మక భారతీయ విజ్ఞాన సంస్థ ప్రాంగణంలో ప్రత్యేక అవగాహన పర్యటన నిర్వహించారు.సహాయ నిర్వప ాణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఇరవై మంది ప్రధానోపాధ్యాయుల బృందం ఈ అధ్యయన పర్యటనలో పాల్గొన్నారు.ఈ పర్యటనలో భాగంగా విద్యారంగంలో చోటుచేసుకుంటున్న నూతన ఆవిష్కరణలు, ఆధునిక బోధనా పద్ధతులు సమర్థవంతమైన పాఠశాల యాజమాన్య సూత్రాలపై బృందం సమగ్ర అవగాహన పెంపొందించుకుంది.ఇక్కడ పొందిన అనుభవాలు ఉత్తమ నిర్వహణ పద్ధతులు జగిత్యాల జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగు పరచడానికి, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించడానికి ఎంతగానో తోడ్పడతాయని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.నాణ్యమైన విద్య, సమర్థవంతమైన నాయకత్వం ఆదర్శవంతమైన పాఠశాలల రూపకల్పన దిశగా ఇటువంటి పర్యటనలు ఎంతో దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



చొప్పదండి వార్త



ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి

24వ విడత విడుదలను వీక్షించిన పాల్గొన్న కౌన్సిలర్లు

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి పట్టణంలోని ఎం సి సి రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడత విడుదల కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజన్నల రాజు, చిల్ల అర్చన శ్రవణ్ కుమార్, జిట్ట మంగ కుమార్ పాల్గొని రైతులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఈ సందర్భంగా చర్చించారు.

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలలో
సిద్ధార్థ పాఠశాల విద్యార్థికి స్వర్ణ పథకం

సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి



చొప్పదండి,ప్రభాతవార్త: పెద్దపల్లిజిల్లా గోదావరిఖనిలోని ఎన్ టి పి సి రామగుండం మహాత్మా గాంధీ స్టేడియంలో ఈ నెల 14న జోనల్ స్థాయి లో క్రికెట్ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో కరీంనగర్ జిల్లా జట్టు తరఫు న సిద్ధార్థ స్కూల్ విద్యార్థి మృధుల్ ఆడి తన అత్యుత్తమ ప్రతిభను కనబరిచి క్రికెట్ క్రీడా రంగంలో జోనల్ స్థాయిలో స్వర్ణ పతకాన్ని సాధించాడు. అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో జరిగే క్రికెట్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి విద్యార్థిని ప్రశంసించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా నిరంతరంగా కృషి చేస్తే ఎంతటి విజయానైనా సాధిం చవచ్చునని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్కూల్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థిని అభినందించారు.

భూపాలపట్నంలో పౌర హక్కుల దినోత్సవం

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి మండల పరిధిలోని భూపాలపట్నం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ మడిపల్లి సంజీవ్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం జరిగింది. పౌర హక్కుల దినోత్సవం ప్రాధాన్యత గురించి తాసిల్దార్ నవీన్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, ఉప సర్పంచ్ నరేష్ కుమార్, వివిధ శాఖల నుండి ఎన్ అశోక్, శ్యాంసుందర్, మాజీ వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి చందు, మాజీ సర్పంచ్ తోడేటి డేవిడ్, మాజీ ఉపసర్పంచ్ భైరగోని కిట్టు గౌడ్, మీనయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మాచర్ల వంశీ, వార్డు సభ్యులు మహేష్, సురేష్ కుమార్, రాజేశం, స్వామి, జిపిఓ తిరుపతి, ఏ ఈ ఓ సంపత్ లతోపాటు ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, సమైక్య సంఘం అధ్యక్షులు, అన్ని కుల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



ఢిల్లీ గర్జనకు తరలిన బోయిని పల్లి కాంగ్రెస్ నేతలు

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన సంగీతం శ్రీనివాస్

బోయిన్ పల్లి ప్రభాత వార్త

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సాగుతున్న ఓటు చోరీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టిన దేశవ్యాప్త పోరాటానికి మద్దతుగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఢిల్లీకి తరలివెళ్లాయి. రాహుల్ గాంధీ పిలుపు మేరకు చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా, మండల స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు ప్రత్యేక బస్సు ద్వారా రాజధానికి బయల్దేరారు.!! ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికల వ్యవస్థను, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం, దేశ భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ చేస్తున్న నిరంతర పోరాటానికి అండగా నిలవడానికే తామంతా ఢిల్లీ పయనమయ్యామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా



కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వెనుకాడబోవని హెచ్చరించారు.ఈ యాత్రలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి , సెస్ (దినిళీళీ) డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్, వైస్ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, వినోద్ రెడ్డి, జనరల్ సెక్రటరీ భరత్ రెడ్డి, బోయిని వేణు, రజనీకాంత్ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులంతా పార్టీ జెండాలను చేతబూని, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ఢిల్లీ బాట పట్టారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఆది శ్రీనివాస్

నూకలమర్రిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేములవాడ రూరల్ ప్రభాత వార్త

వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసి వారికి అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నియోజకవర్గంలో 17 ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించామని, నూకలమర్రికి కూడా సబ్‌స్టేషన్ మంజూరైందని వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వినియోగంపై రైతులకు ముందస్తు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.



రాబోయే రోజుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని రూ.20 వేల కోట్ల సహాయం కోరినట్లు తెలిపారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, విత్తనాలు, పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్, రొండి రాజు,ఆత్మ కమిటీ చైర్మన్ ముకుందరెడ్డి, సోయినేని కర్ణాకర్, సర్పంచ్ నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల వంతెన సమస్యకు విప్ ఆది శ్రీనివాస్ స్పందన

నూకలమర్రిలో వంతెన నిర్మాణానికి చర్యలు

వేములవాడ రూరల్ ప్రభాత వార్త

వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఊరవని చెరువు కింద సాగు చేసే రైతులు వంతెన నిర్మించాలని వినతిపత్రం అందజేశారు.గతంలో ఎల్లంపల్లి వరద కాలువ డి9 కాలువ నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో మాదరిపల్లె నుంచి ఊరవని చెరువు అవతలి వైపు ఉన్న తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వంతెన లేక సుమారు 100 మంది



రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్, సోమినేని బాలు, గ్రామ ప్రజలు కలిసి విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్ వెంటనే సంబంధిత ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ సమస్యపై వెంటనే స్పందించిన విప్ ఆది శ్రీనివాస్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన రెడ్డి సంఘం కార్యవర్గం ను సన్మానించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండల రెడ్డీ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గం ను చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ని మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భం గా ఎం ఎల్ ఏ మేడి పల్లి సత్యం సంఘం నూతన కార్యవర్గం ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చల్లా శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యక్షులు గుడి శ్రీనివాస్ రెడ్డి,మానేరు లక్ష్మారెడ్డి ముచ్చ శ్రీనివాస్ రెడ్డి ముచ్చ శేఖర్ రెడ్డి కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ రెడ్డి సంయుక్త కార్యదర్శి పాశం నారాయణ రెడ్డి,కంకణాల పురుషోత్తం రెడ్డి, ద్యావ నరేందర్ రెడ్డి, గోలి శ్రీనివాస్ రెడ్డి కోశాధికారి డబ్బు.వెంకట్ రెడ్డి లను సన్మానించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మండల రెడ్డి సంఘ సంక్షేమం కోసం



తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో.కోరేం సింగిల్ విండో చైర్మన్ వన్నెల మమత రమణా రెడ్డి సింగిల్విండో డైరెక్టర్ అనుపట్ల శ్రీలతా తిరుపతి రెడ్డి సంఘం మెంబెర్ కొమ్ముల ఆనంద రెడ్డి గుడి రవీందర్ రెడ్డి ఆముదాల లక్ష్మారెడ్డి గోగూరి చెంద్రా రెడ్డి మోతె ఎల్లారెడ్డి ఏమిరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ రద్దు కోసం ఢిల్లీ బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

చందుర్తి : ప్రభాతవార్త

ఢిల్లీలోని రాం లీలా మైదానంలో నవంబర్ 1న జరగనున్న ఇండియా కూటమి మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి శుక్రవారం ఢిల్లీకి బయలుదేరారు.ఈ సందర్భంగా చైర్మన్ చెలుకల తిరుపతి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా చేపడుతున్నామని తెలిపారు.ఢిల్లీ రాం లీలా



మైదానంలో నవంబర్ 1న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న ఈ ర్యాలీలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో చందుర్తి మాజీ జెడ్పిటిసి నాగం కుమార్, సర్పంచులు బొడిగె అనిల్, అవారి రమేష్, దూది మనిషా శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

వేములవాడ వార్త

రామన్నపేటలో సివిల్ రైట్స్ డే

చందుర్తి : ప్రభాతవార్త



చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో శుక్రవారం (సివిల్ రైట్స్ డే పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. సర్పంచి పోతరాజు భారతి నగేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మహేందర్ మాట్లాడుతూ గ్రామాలలో అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. గ్రామాలలో ఎవరైనా అంటరానితనాన్ని ప్రదర్శిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా అంటారని తనం నిర్మూలనకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేణు. హెడ్ కానిస్టేబుల్ రామస్వామి. జిపిఓ చందు పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ . మాజీ సర్పంచ్ దుమ్ము ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మార్గదర్శి విద్యార్థులు

ప్రభాత వార్త కోనరావుపేట ఈ నెల 31,



నవంబర్ 1న నిర్మల్ లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో మార్గదర్శి విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొంటారని కరస్పాండెంట్ మండల చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన అన్నారు పీఈటీ ధర్మేందర్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

38 ఎజెండాలకు ఏకగ్రీవ ఆమోదం

.వేములవాడ ప్రభాత వార్త:



పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 38 ఎజెండా అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.6.50 కోట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ.4.20 కోట్లు, ఎంట్రన్స్ టవర్లు, హైమాస్ట్ లైట్లకు రూ.1.40 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించామని పేర్కొన్నారు. గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో బయటపెడతామని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమాలు

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలంలోని మల్లాపూర్ , మానువాడ గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలను మండల వ్యవసాయ అధికారులు నిర్వహించారు . రాబోవు కాలంలో వ్యవసాయ శాఖ అనుసరించబోయే విధానాలను వారికి తెలిపారు. ఎలినో ప్రభావం ఉంటుందని పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రణీత రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాగుభూమి సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

జిల్లా వ్యవసాయాధికారి బి.శ్రీనివాస్

ఖమ్మంపల్లి రైతు వేదికలో కేతి బచావ్ అభియాన్

ముత్తారం, ప్రభాతవార్త:

నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్ రైతులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సాగుభూమి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ముత్తారం మండలం ఖమ్మంపల్లి రైతు వేదికలో కేతి బచావ్ అభియాన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమతుల్య, సహజ ఎరువుల వినియోగం, భూసార పరిరక్షణ, నీరు ఇతర వనరుల పొదుపు, సుస్థిర పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సహజ వ్యవసాయాన్ని అలవర్చుకోవడం ద్వారా



నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వివరించారు. రానున్న ఎల్‌నినో ప్రభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. అంజని, కేవీకే రామగిరి ఖిల్లా సీనియర్ సైంటిస్ట్ వెంకట రమేష్, సైంటిస్ట్ వినోద్, మండల వ్యవసాయ అధికారి అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. శ్రీలేఖ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అధికారుల నిరక్ష్యం. కాలిపోయిన విద్యుత్ దీపాలు

కొత్త డీటీఆర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ సమత తిరుపతి విజ్ఞప్తి

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలం హరిపురం గ్రామంలో విద్యుత్ అధికారుల నిరక్ష్యం కారణంగా వీధి దీపాలు, ఐమాస్ లైట్లు కాలిపోయాయని సర్పంచ్ మెంగని సమత తిరుపతి తెలిపారు. బుధవారం రాత్రి సింగిల్ ఫేజ్ డీటీఆర్ వద్ద లెవన్ కేవీ కేబుల్ తెగి వీధి దీపాల వైర్‌కు తగలడంతో గ్రామంలోని ప్రధాన రహదారి, 4, 5వ వార్డుల పరిధిలోని వీధి దీపాలతో పాటు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు పూర్తిగా కాలిపోయాయని పేర్కొన్నారు. గత 6 నెలలుగా సింగిల్ ఫేజ్ డీటీఆర్ పై అధిక లోడ్ ఉండటంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అధిక లోడ్‌ను తగ్గించేందుకు మరోచోట కొత్త డీటీఆర్ ఏర్పాటు చేయాలని కోరగా, మంజూరైనా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిరక్ష్యం వల్ల గ్రామంలో ఆస్తి నష్టం జరిగిందని, వెంటనే కొత్త డీటీఆర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మైదంబండలో పౌర హక్కుల దినోత్సవం

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి తహశీల్దార్ ఆంజనేయులు హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో దళితుల పట్ల వివక్ష చూపితే చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. అంటరానివారిగా చూసిన, గుడుల్లోకి, ఇతర ప్రదేశాల్లోకి అనుమతించకపోయిన, రెండు గ్లాసుల విధానం పాటించిన, వారిపై దూషణలు, దాడులు చేసిన చట్టరిత్యా చర్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. సర్పంచ్ బియ్యాని శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎ ఎస్ ఐ దేవేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజబాబు, గ్రామస్తులున్నారు.

నవంబర్ 1న మంథని, ధన్వాడకు శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఆశీర్వచనం పొందాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, ముత్తారం మండల మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం

ముత్తారం, ప్రభాతవార్త:

ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ నవంబర్ 1న మంథని, ధన్వాడ ప్రాంతాల్లో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, ముత్తారం మండల మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం తెలిపారు. ముత్తారంలో స్వామీజీ పర్యటనకు సంబంధించిన గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానం మేరకు స్వామీజీ దత్తాత్రేయ ఆలయాలను సందర్శించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో, మధ్యాహ్నం 2 గంటలకు మంథనిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో భక్తులకు ఆశీర్వచనం,



అనుగ్రహ భాషణం అందించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, భక్తి మార్గాన్ని బోధిస్తూ భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న స్వామీజీ దర్శనం ఈ ప్రాంత ప్రజలకు మహాభాగ్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పెగడ తిరుమల కుమార్, రాపెల్లి రాజయ్య, ఉప సర్పంచ్ సింగనవేన సదయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు కోల విజయ్, కేశనపెల్లి గ్రామ వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మండపు రాంబాయి మృతి

పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

మంథని రూరల్ ప్రభాతవార్త:



మంథని మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మండపు రాంబాయి శనివారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మంథని మాజీ ఎంపీపీ కొండ శంకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ. అనంతరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ స్వరూప్ రెడ్డి, సెగ్గం రాజేష్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, రామడుగు మారుతిరావు, మాజీ కాళేశ్వరం డైరెక్టర్, మాజీ సర్పంచ్ బాపు గ్రామ నాయకులు, పాల్గొని మండపు రాంబాయికి నివాళులర్పించారు.

హత్య కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

శిఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా

మంథని రూరల్ ప్రభాతవార్త:

మంథని పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన హత్య కేసులో ఇద్దరు నిందితులకు గోదావరిఖని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా కూడా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది.మంథని మండలం తోటగోపయ్యపల్లి గ్రామంలో 2021 అక్టోబర్ 31న కుటుంబ వివాదం నేపథ్యంలో బందెల రాయగట్టు, బందెల లింగయ్య అనే సోదరులు బందెల లక్షి మ కుటుంబంపై దాడి చేశారు. ఈ క్రమంలో వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆమె కుమారుడు బందెల రవిపై గొడ్డలి, కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరుసటి రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు.ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్ష ఖరారు చేసింది. ఇన్‌ఛార్జ్ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల తీర్పు వెలువరించగా, ప్రాసిక్యూషన్ తరఫున ప్రజా న్యాయవాది సీహెచ్ పద్మజ వాదనలు వినిపించారు. కేసు విచారణలో అప్పటి మంథని ఎస్ఐ పి. చంద్రకుమార్, సీఐ జి. సతీష్‌తో పాటు కోర్టు డ్యూటీ అధికారులు శంకర్, ఆదేశ్, సురేందర్ సహకరించారు.



హెచ్‌సీఏ వన్డే లీగ్‌లో మెరిసిన మంథని యువ క్రికెటర్ ఖాజా మజహరుద్దీన్

మంథని ప్రభాతవార్త:



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న వన్డే లీగ్‌లో మంథనికి చెందిన యువ క్రికెటర్ ఖాజా మజహరుద్దీన్ అదరగొట్టాడు. శుక్రవారం మారేడ్‌పల్లి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఎలిగెంట్ జట్టు తరఫున బరిలోకి దిగిన ఖాజా మజహరుద్దీన్ తన 10 ఓవర్ల కోటాలో ఒక మెయిడిన్‌తో 48 పరుగులు మాత్రమే ఇచ్చి కీలకమైన 5 వికెట్లు పడగొట్టాడు. తన పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జమీల్ అహ్మద్ తనయుడైన ఖాజా మజహరుద్దీన్, భారత జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మకు చిన్నప్పటి నుంచి కోచింగ్ ఇస్తున్న ప్రముఖ కోచ్ సలాం బయాష్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఖాజా మజహరుద్దీన్ మాట్లాడుతూ "మంథనికి మంచి పేరు తీసుకురావడమే నా లక్ష్యం. నా కలలను నిజం చేసుకోవడానికి హైదరాబాద్‌లో ఉంటూ కష్టపడుతున్నాను. నా సొంతూరైన మంథనికి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరుకుంటున్నాను" అని తెలిపాడు. ఐదు వికెట్ల ఘనత సాధించిన ఖాజాపై మంథని ప్రాంత ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

బీసీ అసోసియేషన్ పెద్దపల్లి సర్కిల్ లైజన్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

మంథని ప్రభాతవార్త



:బీసీ అసోసియేషన్ పెద్దపల్లి సర్కిల్ లైజన్ ఆఫీసర్‌గా నియమితులైన సామల సత్యనారాయణను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామల సత్యనారాయణ మర్యాదపూర్వకంగా మంథని డివిజన్ డీఈఈ ఆపరేషన్స్ శ్రీ ప్రభాకర్‌ను కలిశారు. నూతన బాధ్యతలు చేపట్టినందుకు ప్రభాకర్ ఆయనను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఏ ఓ తిరుపతయ్య, ఏడీఈ ఆపరేషన్స్ మంథని రమేష్, గోదావరిఖని ఏడీఈ ఆపరేషన్స్ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్లు రాజశేఖర్, కార్తీక్, ఏఈలు, బీసీ అసోసియేషన్ నాయకులు, పలువురు పెద్దలు పాల్గొని సామల సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు.నూతనంగా చేపట్టిన లైజన్ ఆఫీసర్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ బీసీ సంఘం అభివృద్ధికి, బీసీ వర్గాల సంక్షేమానికి విశేష కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

పీఎం కిసాన్ 24వ విడత నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారం

మైదంబండ, ఖమ్మంపల్లి రైతు వేదిక నుంచి వీక్షించిన రైతులు

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలంలోని మైదంబండ, ఖమ్మంపల్లి రైతు వేదికల్లో పీఎం కిసాన్ 24వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా శుక్రవారం రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సందేశాన్ని వీక్షించి కార్యక్రమం వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంపల్లి రైతు వేదిక నుంచి జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్, సహాయ వ్యవసాయ సంచాలకులు న. అంజని, కేవీకే సీనియర్ సైంటిస్ట్ వెంకట రమేష్, సైంటిస్ట్ వినోద్ కుమార్, మండల వ్యవసాయ అధికారి జె. అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. శ్రీలేఖతో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు

గ్రామాల్లో నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

గొల్లపల్లి , (ప్రభాతవార్త):

గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టి భూగర్భ జలమట్టాన్ని పెంచడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అగ్గిమల్ల, గంగాదేవిపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి జల సంరక్షణ పనులు, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టేందుకు ప్రతి గ్రామపంచాయతీలో జలసిరి కార్యక్రమం కింద నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టోన్ ట్రెంచెస్, కాంటూర్ కందకాలు వంటి పనులను అవసరమైన ప్రాంతాల్లో గుర్తించి చేపట్టాలన్నారు. వీటి ద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు భూమిలో తేమశాతం నిల్వ ఉండి పంటల దిగుబడులు



మెరుగుపడతాయని తెలిపారు. వీబీ జీ రామ్ పథకం కింద రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి , గ్రామాల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణ, భూసార పరిరక్షణ, గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి దోహదపడే పనులకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఈ పర్యటనలో డీఆర్‌డీఓ రఘువరన్, ఆర్డీఓ మధుసూదన్, పీఆర్ఈఈ లక్ష్మ ణ్ కుమార్, డీఈ అశ్విన్, ఎంపీడీఓ రవీందర్‌రావు, ఏపీఓ మ్రి వేణు, పీఆర్ఏఈ కళ్యాణ్ రెడ్డి, సర్పంచులు కొలకాని జలంధర్, కంకణాల వసంత, లక్ష మ్ణ్‌తో పాటు ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరువు ముప్పును ఎదుర్కొనేందుకు 'జలసిరి' పనులు వేగవంతం చేయాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

పెగడపల్లి, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో రానున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నంచర్ల గ్రామంలో ఫామ్ ఫాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పెగడపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం జలసిరి కార్యక్రమం కింద చేపడుతున్న వివిధ పనుల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి ఇంటికి ఒకటి చొప్పున మ్యాజిక్ సోక్‌పిట్లు నిర్మించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద కమ్యూనిటీ సోక్‌పిట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో మురుగునీరు వృథాగా పారిపోకుండా డ్రైనేజీ కాలువల చివరన డ్రైన్ ఎండ్ సోక్‌పిట్లు నిర్మించి నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా పారిశుద్ధంతోపాటు భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఫామ్ పాండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నీటిమట్టం తగ్గిన, నిరుపయోగంగా ఉన్న బోరుబావులను గుర్తించి వాటిని



రీఛార్జ్ చేసేందుకు అవసరమైన నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులన్నీ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జలసిరి పనులన్నీ వి.బి.జి రామ్ జీ పథకంలో భాగంగా చేపడుతున్నందున ప్రతి గ్రామంలో కూలీల సంఖ్యను పెంచి, నిర్దేశించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షి స్తూ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, ఆర్డీఓ మధుసూదన్, డీఎల్‌పీఓ విమల, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, ఎంఆర్ఓ నిజాముద్దీన్, ఏపీఓ అనిల్‌కుమార్, నంచర్ల సర్పంచ్ కుంటాల వనజ శ్రీనివాస్, ఆ రైలు శ్రీనివాస్ జమున, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

నరసింహుని పేటలో భూభారతి లో భాగంగా రీ సర్వే ప్రారంభం

పెగడపల్లి, ప్రభాతవార్త:

భూభారతి కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండలంలోని నర్సింహునిపేట గ్రామంలో శుక్రవారం భూ సర్వే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ నిజాముద్దీన్ మాట్లాడుతూ గ్రామంలోని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను నమోదు చేస్తామన్నారు. భూ సర్వేకు సంబంధించిన ప్రక్రియలో రైతులు, భూయజమానులు అధికారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా భూ రికార్డుల స్పష్టతకు అవకాశం కలగానుందని తాసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధి రాజమణి మల్లారెడ్డి, నాయకులు కడారి



తిరుపతి, సర్పంచ్ జీల రాకేష్, ఆర్ ఐ శ్రీనివాస్, సర్వేర్ తనుజారాణి, జిపిఓ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కీచులాటపల్లిలో ఫామ్ ఫామ్ పాండ్‌పనుల పరిశీలన

పెగడపల్లి, ప్రభాతవార్త:



పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లి గ్రామంలో వి.బి.జి. రామ్ జీ పథకం కింద నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను సర్పంచ్ రాచకొండ ఆనంద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు హార్వెస్టింగ్ పాండ్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇరవేణి రజినీకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఇరుగు రాళ్ల లక్ష్మి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

ఎస్సీ సామాజిక వర్గానికి కాంగ్రెస్ లో సముచిత స్థానం..

మానకొండూర్: ప్రభాతవార్త



: ఎస్సీ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరిగిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రవీంద్ర చారి, ఏఎంసీ మార్కెట్ చైర్మన్ రేవల్లి రాజలింగం అన్నారు. శుక్రవారం మానకొండూర్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మడుపు ప్రేమ్ కుమార్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,ప్యాక్స్ డైరెక్టర్లు,పార్టీ ఎస్సీ సెల్ గ్రామ శాఖల అధ్యక్షులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సంపత్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు రామిడి తిరుమల్ రెడ్డి,కనకం కుమార్,ఎర్రల కవిత,చలిగంటి సంపత్,రాపాక రాజేశ్వర్,మొగిలి,ఎస్సీ సెల్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు



న్యాయ విజ్ఞాన సదస్సు



బుగ్గారం ప్రభాతవార్త

బుగ్గార మండల కేంద్రంలో గల శ్రీ గ్లోబల్ హైస్కూల్లో బుగ్గారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి న్యాయ విభాగ మొదటి శ్రేణి మెజిస్ట్రేట్ వై. జానకి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు మరియు చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన చట్టాలను. పోక్సో చట్టాలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మొదలగు అంశాలతో పాటు నేడు యువత పెడదారి పట్టడానికి గల కారణాలైన గంజాయి డ్రగ్స్ మొబైల్ యాప్స్ వల్ల జరిగే అనర్థాలను గురించి పిల్లలకు ప్రస్ఫుటమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎస్.శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ నక్కరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ధర్మపురి విద్యార్థులు ఎంపిక





ధర్మపురి, ప్రభాతవార్త:

ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ధర్మపురి విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ధర్మపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మూసుకు విశాల్ జావెలిన్ త్రోలో ద్వితీయ బహుమతి సాధించగా, పల్లపు రమ్య డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం సాధించింది. ఇద్దరూ తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్నతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పంటల రక్షణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ధర్మపురి, ప్రభాతవార్త:



మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల రక్షణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జగిత్యాల సమన్వయకర్త డాక్టర్ తిరుపతి సూచించారు. శుక్రవారం ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్‌తో కలిసి పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటల్లో చీడపీడలు, తెగుళ్ల ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని, సమస్యలు ఎదురైతే వ్యవసాయ నిపుణులను సంప్రదించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున రబీ సీజన్‌లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు వేముల విక్రమ్ రెడ్డి, వేముల కరుణాకర్ రెడ్డి, శేర్ల మహేందర్, గంధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ప్రపంచస్థాయి గుర్తింపు....

ఆర్చరీలో తెలంగాణకు రెండు స్వర్ణ పతకాలు..
క్రీడాకారిణి చికితకు రూ.4.32 కోట్ల ప్రోత్సాహం..
సుల్తానాబాద్ క్రీడలకు పుట్టినిల్లు..
రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ప్రభాతవార్త: క్రీడల ద్వారా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందడంతోపాటు రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తీసుకురావచ్చని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సుల్తానాబాద్ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లుగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిని గుర్తించి తగిన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని తెలిపారు.శుక్రవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్17 బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను అభినందిస్తూ, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక వికాసానికి, క్రమశిక్షణకు, ఆత్మవిశ్వాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు పట్టుదలతో సాధన చేస్తూ తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.

చికిత విజయాలు యువతకు స్ఫూర్తిదాయకం

పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తాన్పూర్ గ్రామానికి చెందిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించడం తెలంగాణకు గర్వకారణమని విజయరమణారావు అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగిన క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరచడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. చికిత సాధించిన విజయాలు జిల్లాలోని యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, నిరంతర సాధనతో ముందుకు సాగితే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని ఆమె నిరూపించారని కొనియాడారు.క్రీడాకారిణి చికితకు రూ.4.32 కోట్ల ప్రోత్సాహం అందించడం క్రీడా ప్రతిభకు లభిస్తున్న గుర్తింపునకు నిదర్శనమని తెలిపారు. క్రీడల్లో రాణించాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు చిన్నప్పటి నుంచే సాధనపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు తగిన శిక్షణ, మార్గదర్శకత్వం లభిస్తే వారు కూడా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విజయ రమణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. క్రీడా రంగాన్ని గ్రామీణ స్థాయి నుంచి అభివృద్ధి చేయడం, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఖేలో ఇండియా క్రీడలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా క్రీడా రంగానికి మరింత ప్రాధాన్యం లభిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నూ ప్రతిభ కనబరచాలని, క్రీడలను కేవలం వినోదంగా కాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గంగా భావించాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల సమయపాలన, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని, అయితే ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా దానిని విజయానికి తొలి మెట్టుగా భావించాలని సూచించారు.



క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్

సుల్తానాబాద్ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లుగా పేరుగాంచిందని విజయరమణారావు అన్నారు. ఈ ప్రాంతం నుంచి అనేకమంది క్రీడాకారులు వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు విద్యార్థులకు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని చెప్పారు. ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు.క్రీడల్లో గెలుపొందిన వారు మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని, ఓటమి పాలైనవారు తమ లోపాలను సరిదిద్దుకుని తదుపరి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా సాధన కొనసాగించాలని సూచించారు. క్రీడాకారులకు శిక్షణ అందించే వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి మార్గదర్శకత్వంలో విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

నాలుగు జిల్లాల క్రీడాకారుల హాజరు

ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్17 బాలబాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. క్రీడా పోటీల్లో క్రీడాస్ఫూర్తితో పాల్గొని ప్రతిభను చాటాలని సూచించారు. పోటీల నిర్వహణకు సహకరించిన నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమీర్ శెట్టి తిరుపతి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, జీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవీలత, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ తుల శోభారాణి, పీఈటీ అధ్యక్ష, కార్యదర్శులు డా. సురేందర్, దాసరి రమేష్,మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, శ్రావణి రాకేష్, ప్రభాకర్, వర ప్రదీప్, చింతల రాజు, గదాస్ రవీందర్, అబ్బాయి గౌడ్, కుమార్ కిషోర్, దామోదర్ రావు, సాయిర మహేందర్,తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ గిన్నె లక్ష్మణ్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు,వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వీర్‌పాల్, ప్రభాకర్, కుమార్, ఖాజాబీ, శైలజ, సంధ్య, శ్రీవాణి, రూపారాణి, నిర్మల, రాము, అనూప్, సాగర్ తదితరులు, విద్యార్థులు హాజరయ్యారు.

బియ్యం అక్రమ నిల్వలు చేస్తే క్రిమినల్ కేసులు

వ్యాపారులను హెచ్చరించిన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
బియ్యం వ్యాపారులకు ధరలు, బరువులపై స్పష్టమైన సూచనలు

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: బియ్యం కొరత ఉన్నట్లు ప్రచారం చేస్తూ కృత్రిమ కొరతకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు హెచ్చరించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని తన ఛాంబర్‌లో హోల్‌సేల్ బియ్యం వ్యాపారులతో సమావేశమై ధరలు, నిల్వలు, అమ్మకాల తీరుపై సమీక్షించి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి బియ్యం దుకాణం రోజువారీ నిల్వల వివరాలను నమోదు చేయాలని, సంబంధిత రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. బియ్యం కొరత ఉందంటూ ప్రజల్లో భయాందోళనలు కలిగించే ప్రయత్నాలు చేయరాదని స్పష్టం చేశారు. అక్రమంగా సరుకును నిల్వ ఉంచి మార్కెట్‌లో కృత్రిమ కొరత కల్పించే చర్యలను సహించబోమని పేర్కొన్నారు. దుకాణాల వద్ద నోటీసు బోర్డులు ఏర్పాటు చేసి బియ్యం బ్రాండ్లు, రకాలు, విక్రయ ధరలను వినియోగదారులకు తెలిసేలా ప్రదర్శించాలని అదనపు కలెక్టర్ సూచించారు. బియ్యం బస్తాల్లో నిర్ణీత పరిమాణం కచ్చితంగా ఉండాలని, కొనుగోలుదారులకు సరైన బరువుతో సరుకు అందించాలని ఆదేశించారు. 26 కిలోల బస్తాలో 25 కిలోల బియ్యం మాత్రమే లభిస్తోందని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపడతారని, ఈ సందర్భంగా రికార్డుల్లో లోపాలు, బ్లాక్ మార్కెటింగ్, సన్న బియ్యం అక్రమ నిల్వలు బయటపడితే క్రిమినల్ కేసులతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో బియ్యం కొరత లేదని, సమృద్ధిగా నిల్వలు ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వ్యాపారుల పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, బియ్యం దుకాణాల యజమానులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు చేస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమమే..!

25న రాష్ట్ర మహాసభలు.. నియోజక వర్గానికి 50 మంది తరలి రావాలి.. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్

పెద్దపల్లి, ప్రభాతవార్త: దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు చేస్తే సహించబోమని, రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడుతామని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని పద్మిని హోటల్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, వివక్షను తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ముఖ్యంగా పోలీసులు ఇటువంటి చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఇటీవల సిరిసిల్లకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై సిరిసిల్ల పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన జర్నలిస్టులను ఐక్యం చేసి, జిల్లా కమిటీలు లేని ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీల నిర్మాణం పూర్తయిన అనంతరం నవంబర్ 25న రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని, ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందని, అక్రిడిటేషన్ కమిటీల్లో వారికి ప్రాతినిధ్యం లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, ఇంటి స్థలాలు కల్పించే వరకు రాష్ట్ర కమిటీ పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించినా ప్రభుత్వ విధానంలో మార్పు రాలేదని విమర్శించారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి తమ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, తెడ్డు సాయిలు, చుంచు బాబు, సంయుక్త కార్యదర్శి ఈరోల్ల పురుషోత్తం, ఆర్గనైజింగ్ కార్యదర్శి అరుణ్, ఉత్సవ కమిటీ రాష్ట్ర చైర్మన్ సంతోష్, కోకన్వీనర్ సురేష్, నాయకులు వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

బాలల భద్రతపై నిర్లక్ష్యం వద్దు..

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోహిర్కర్
విద్యార్థులకు బాలల హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన

పెద్దపల్లి, ప్రభాతవార్త: పిల్లలపై జరిగే వేధింపులను అరికట్టేందుకు చట్టాలు అందుబాటులో ఉన్నాయని, బాధితులు భయపడకుండా సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోహిర్కర్ సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆదేశాల మేరకు సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా రంగంపల్లి మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ, వేధింపుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా వంటి ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడేందుకు చట్టాలు ఉన్నాయని వివరించారు. బాలల సహాయం కోసం 1098 నంబర్‌కు, న్యాయ సహాయం కోసం 1500 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ అధికారి నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాచూరు శ్రీకాంత్, కార్యదర్శి నరేష్, కల్చరల్ సెక్రటరీ శరత్, బార్ల రమేష్, మహిళా న్యాయవాదుల విభాగం నుంచి ఝాన్సీ, రమా, కల్పన, శ్యామల, డీసీపీఓ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పారదర్శకత కోసమే మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాల అప్పగింత

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి..

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

ధాన్యం కొనుగోళ్లలో పూర్తి పారదర్శకతను పాటించడంతో పాటు అక్రమాలకు తావులేకుండా చేసేందుకే కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు చ్రకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్‌కు అడ్డుకట్ట వేసి, రైతులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కోతలు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాలకు చేరువలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల్లో కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే సూచించారు.సిరిగినేనికి కవ్వంపల్లి నివాళితిమ్మాపూర్: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతి చెందిన తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన సిరిగినేని చిన్న కొండల్ రావు కుటుంబ



సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు.శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి నుస్తులాపూర్ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే.. చిన్న కొండల్ రావు భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, నుస్తులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గోదారి తిరుపతి, నాయకులు గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతిరెడ్డి, బుధారపు శ్రీనివాస్, తమ్మనవేణి రాములు యాదవ్, ఎలుక రాజు, రెడ్డిగాని రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ లో న్యాయ అవగాహన సదస్సు

చిగురుమామిడి, ప్రభాత వార్త

:చిగురుమామిడి మండలం ముల్కనూర్‌మోడల్ స్కూల్ లో శుక్రవారం జిల్లా చట్టసేవాధికార సంస్థ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 8, 9, 10వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమాజంలో చట్టాలపై అవగాహన, బాలల హక్కులు, రక్షణ అంశాలపై సుదీర్ఘంగా వివరించారు.ఈ కార్యక్రమానికి హాజరైన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధులు, ప్రముఖ అడ్వకేట్లు ఆవునూరి వరుణ్ కుమార్, మనువాడ రామాంజనేయులు, తోట మనోహర్, కొండ్ర లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రాథమిక చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు.ప్రధానంగా చర్చించిన అంశాలు:పోక్సో చట్టం చిన్న పిల్లలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాలల భద్రతకు కల్పిస్తున్న రక్షణల గురించి సమగ్రంగా వివరించారు.ర్యాగింగ్ నిషేధం, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయడం నేరమని, ర్యాగింగ్ నిషేధ చట్టం కింద కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.బాలల హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగం కల్పించిన బాలల



హక్కులతో పాటు సమాజంలో విద్యార్థులు పాటించాల్సిన ప్రాథమిక బాధ్యతలు, విధులను గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన కల్పించడం వల్ల సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్యార లీగల్ వాలంటీర్ ములుగురు వైశాలి, ఉపాధ్యాయులు పి రాములు, షేక్ ఆసిఫ్ అలీ, పరశురాములు, వి ముక్తి ప్రసాద్, సయ్యద్ ఇర్షాద్ అలీ పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మద్దికుంటలో జలసిరి కార్యక్రమం..

మానకొండూర్, ప్రభాతవార్త

: మండలంలోని మద్దికుంట గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ బుర్ర శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో జలసిరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో వెంకట వరలక్ష్మి ,ఎంపీ ఓ సతీష్ రావు పాల్గొని జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలకు, బోర్ వేల్ రీఛార్జ్ పిట్, కమ్యూనిటీ సోక్ పిట్ ల నిర్మాణానికి ముగ్గులు



పోశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల ప్రజలు నీటిని వృధాచేయవద్దన్నారు .నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిల్లా శ్రీధర్, టిఏశ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి కవిత, ఫీల్డ్ అసిస్టెంట్, జిపి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

మంథనిలో ఘనంగా శిఖర కలాపకర్షణ పూజలు



మంథని ప్రభాతవార్త:

మంథని పట్టణంలోని పురాతన శ్రీ గౌతమేశ్వర ఆలయంలో శిఖర కలాపకర్షణ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గౌతమేశ్వరాలయ చైర్మన్ గుండా రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, నవగ్రహ పూజ, హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు హాజరై పూజల్లో పాల్గొన్నారు. వారితో పాటు మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు శ్రీరామభట్ల శీను, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఈవో రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కుల వివక్ష చూపితే చర్యలు తప్పవు

తాసిల్దార్ పర్ణంది సుమన్



రామగిరి ప్రభాతవార్త

గ్రామాలలో కుల వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని రామగిరి తహసిల్దార్ పర్ణంది సుమన్ అన్నారు. శుక్రవారం రామగిరి మండలం లోక కేసారం గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం గ్రామ సర్పంచ్ వీరగోని రమాదేవి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా రామగిరి ఎస్సై తాడవేణి శ్రీనివాస్ తో కలిసి తాసిల్దార్ సుమన్ పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో అందరు కలిసిమెలిసి జీవించాలని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా ఒకరి తక్కువ, ఎక్కువ కులమత బేధాలు లేకుండా కలిసిమెలిసి ఉండాలని కుల మతాలను ప్రేరేపిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ స్వామి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ కే మహేష్, జి పి ఓ తిరుపతమ్మ, కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి!

నాలుగు డంపర్లు.. 75 ట్రాక్టర్ల ఇసుక స్వాధీనం



తిమ్మాపూర్, ప్రభాత వార్త:

మండలం కొత్తపల్లి గ్రామంలో ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డంపర్ల ఇసుకతో పాటు సుమారు 75 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో ఎస్ఐ సురేందర్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సురేంద్ర, పాల్ సింగ్, మల్లేశం, కానిస్టేబుళ్లు సాయిదీప్, విశ్వతేజ దాడిలో పాల్గొన్నారు. అక్రమ ఇసుక నిల్వలు, రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు చేపట్టారు.

మాల మహానాడు జిల్లా ప్రచార కార్యదర్శిగా ముల్కల రాజశేఖర్ నియామకం

తిమ్మాపూర్, ప్రభాత వార్త



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన ముల్కల రాజశేఖర్ తెలంగాణ మాల మహానాడు కరీంనగర్ జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బ్లడ్ బ్యాంకులో పనిచేస్తూ అత్యవసర సమయాల్లో రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడటంలో రాజశేఖర్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

ఊటూరు-వేగురుపల్లి రోడ్డు నిర్మాణం కోసం కృషి చేస్తా..

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయ

మానకొండూర్: ప్రభాతవార్త :



మానకొండూరు మండలంలోని ఊటూరు నుండి వేగురుపల్లి రోడ్డు సమస్యను అధికారులతో మాట్లాడి త్వరలోనే నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు.శుక్రవారం మానకొండూర్ మండలంలోని ఊటూరు గ్రామాన్ని ఎమ్మెల్యే మండల కాంగ్రెస్ నేతలతో కలిసి సందర్శించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ క్రమంలో స్థానికులు ఊటూరు-వేగురుపల్లి రహదారి గుంతలు గుంతలు గా మారి ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ట్రాన్స్‌కోకు సంబంధించిన సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఊటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడుమొర్రి శంకరయ్యటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెలిశెట్టి కళ్యాణి కిశోర్, ఉప సర్పంచ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బొంగోని సునిల్, నాయకులు చంద్రమోళి, స్వామి, పల్లెర్ల లక్ష్మారెడ్డి, గుడాల మహేందర్, రామగిరి లక్ష్మణ్, వంతడ్పుల అనిల్, శంకరయ్య, జెన్నయ్య, శ్రీనాథ్, మత్తయ్య, వెంకట్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

న్యాయ విజ్ఞాన సదస్సు లో మంథని కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి

రామగిరి ప్రభాతవార్త



చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మంథని కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి అన్నారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ లో న్యాయ సేవా సమితి, మంథని ఆధ్వర్యంలోన్యాయ విజ్ఞాన సదస్సు గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులకు బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టం, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం గురించి వివరంగా తెలియజేశారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల తమను తాము రక్షించుకోవడమే కాకుండా సమాజంలో జరిగే అన్యాయాలను అడ్డుకోచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి అనురాధ, మంథని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కే రగోత్తం రెడ్డి న్యాయవాదులు శశి భూషణ్ కాచే ,బండారి మాధురి ,ఏఎస్ఐ స్వామి ప్రధానోపాధ్యాయులు ఆడెపు రవి తో పాటు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్‌లు ఈరోజు ఇబ్రహీంపట్నం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, ఆహార పదార్థాల తయారీ, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన పౌష్టికాహారం అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు తెలిపారు.

గుండంపల్లి మీదుగా ఖానాపూర్‌కు నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభించాలి



మల్లాపూర్ ప్రభాతవార్త:

గుండంపల్లి గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు కోరుట్ల డిపో నుంచి గుండంపల్లి, మల్లాపూర్ మీదుగా ఖానాపూర్ వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభించాలని గ్రామ ప్రజాప్రతినిధులు కోరారు.వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌ను శుక్రవారం కలిసి బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ బస్సు సర్వీస్ అందుబాటులోకి వస్తే గుండంపల్లి, మల్లాపూర్ గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.ఈ కార్యక్రమంలో గుండంపల్లి గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య, నాయకులు అంజయ్య, అంతడుపుల గంగాధర్, ధోనిపాల అంజయ్య, దప్పుల నరేష్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:



మెట్‌పల్లి పట్టణంలో ఎస్సారెస్పీ నూతన భవన నిర్మాణ పనులకు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను ప్రారంభించి, సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు విజ్డమ్ విద్యార్థిని ఎంపిక

షాట్‌పుట్‌లో వెలగందుల హరిణికి ప్రథమ స్థానం

మెట్‌పల్లి అర్బన్, ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మెట్‌పల్లి పట్టణంలోని విజ్డమ్ హైస్కూల్ విద్యార్థిని వెలగందుల హరిణి ప్రతిభ కనబరిచింది.పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హరిణి అండర్14 విభాగంలో షాట్‌పుట్ పోటీలో పాల్గొని ప్రథమ స్థానాన్ని సాధించింది. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో హనుమకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో హరిణి పాల్గొననుంది.ఈ సందర్భంగా పాఠశాల పీఈటీలు హరీష్, సాయికుమార్, భూమిక వివరాలు వెల్లడించారు. విద్యార్థిని హరిణిని పాఠశాల కరస్పాండెంట్ ఎన్నమనేని రామారావు అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

టీ జే యస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కి ఘనంగా సన్మానం

. మెట్ పల్లి టౌన్ , ప్రభాత వార్త



తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియామకం అయిన కంతి మోహన్ రెడ్డి ని శుక్రవారం మెట్ పల్లి న్యాయవాదులు శాలువా, పూలమాల తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి మాట్లాడుతూ, మాతోటి న్యాయవాది టిజెయస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం కావడం మాకెంతో గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు మెడిచెల్మల సుమలత, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు గంద్ర ప్రవీణ్ రావు, యండి వల్లియొద్దీన్, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, నాంపల్లి మరుతి, పసునూరి సుదర్శన్, మామిడిపల్లి విజయలక్ష్మి, నేరెళ్ల శ్రీధర్, తెడ్డు ఆనంద్, పసునూరి శ్రీనివాస్, నీరటి రమణ, కోల అశోక్, చింతకుంట శంకర్, టిజెయస్ నాయకులు చిలువేరి నంద గోపాల్, ఏశాల గంగారెడ్డి, గజ్జి రాజేందర్, కంతి రమేష్ లు పాల్గొన్నారు

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నల్ల బ్యాడ్జీల నిరసన.

.కోనరావుపేట ప్రభాత వార్త

మోడల్ స్కూల్స్ సమస్యల పరిష్కారం కోసం ఎంస్ జె ఏ సి పిలుపుమేరకు కోనరావుపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు గురువారం లంచ్ బ్రేక్ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.మోడల్ స్కూల్స్ ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, సి పి ఎస్ డెత్ గ్రాట్యుటీ అమలు చేయాలని, డి ఏ బకాయిలు విడుదల చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 010 ద్వారా జీతాలు చెల్లించాలని.టి జి టి లకు నోషనల్ బెనిఫిట్స్, హెచేబి టీచర్లకు రూ.35 వేల కనీస వేతనం, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టుకు పరామర్శ

ముత్తారం, ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముత్తారం మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఏలువాక కుమారస్వామిని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు నూనేటి కృష్ణ, బాలసాని రాజ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం రామగిరి మండలం పన్నూరు సమీపంలో రహదారిపై పంది అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడగా ఏలువాక కుమారస్వామి గాయపడ్డాడు. దీంతో అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, విషయం తెలుసుకున్న వారు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనకు ధైర్యం చెప్పారు

సీనియర్ జర్నలిస్టుకు ఎస్ ఐ బి ఏజెన్సీ మేనేజర్ పరామర్శ

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఎస్ బి ఐ లైఫ్ మేనేజర్ ఏలువాక కుమారస్వామిని ఎస్ బి ఐ ఏజెన్సీ మేనేజర్ మేకల పద్మ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆయన కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట బృందం సభ్యులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్టుకు పరామర్శ

ముత్తారం, ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్తారం సీనియర్ జర్నలిస్టు ఏలువాక కుమారస్వామిని పెద్దపల్లి మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలువాక రాజయ్య శుక్రవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్కా విక్రాంత్ పటేల్, రాజు తదితరులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంపల్లిలో పోలీసుల అవగాహన2 లీటర్ల నాటుసారా స్వాధీనం..

27 ద్విచక్ర వాహనాల తనిఖీ

ముత్తారం, ప్రభాతవార్త:

మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంథని సీఐ బుద్దే స్వామి సూచించారు. శుక్రవారం ముత్తారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో నిర్వహించిన సీఏఎస్ఓ కార్యక్రమంలో భాగంగా పోలీసులు 27 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో సిఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల నియంత్రణకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అనుమానాస్పద లింకులు, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ఎస్సై ఎన్.రవికుమార్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.